# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 40 | ఎడిటర్: మేనం శ్యామ్ | గురువారం 27-08-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

రాఖీ అంటే చేతికి కట్టే దారం కాదు...
అన్నా–చెల్లెళ్ల మధ్య ఉన్న
పేగు బంధానికి గుర్తు.
ఏ కష్టం వచ్చినా నేనున్నానురా...
అని అన్నయ్య చెప్పే మాటలోనే
చెల్లెలికి కొండంత ధైర్యం ఉంటుంది.
నా అన్నయ్య ఉన్నాడులే...
అనే నమ్మకమే
చెల్లెలి గుండెల్లో పెద్ద బలం.
కానీ ఈ రోజుల్లో ఆస్తులు,
పైసలు, పంతాలు, పట్టింపులు, అపార్థాలు
మనుషుల్ని దగ్గర చేసేది పోయి...
ఒకే తల్లి కడుపున పుట్టిన అన్నాచెల్లెళ్లనే
దూరం చేస్తున్నాయి.
ఒక్కసారి ఆలోచించండి
పైసలు పోతే మళ్లీ సంపాదించొచ్చు...
ఆస్తి పోతే మళ్లీ కొనుక్కోవచ్చు...
కానీ అన్నాచెల్లెళ్ల బంధం పోతే
పేగు బంధమే తెగిపోతుంది.
అందుకే...ఈ రాఖీ పండుగనాడు
ఆస్తుల కోసం విడిపోయిన
బంధాలు
మళ్లీ కలవాలి...
అహంకారంతో
మూసుకున్న తలుపులు
ప్రేమతో తెరుచుకోవాలి...
మాట్లాడటం మానేసిన అన్నాచెల్లెళ్లు
మళ్లీ పలకరించుకోవాలి...
కన్నీళ్లతో నిండిన కుటుంబాల్లో
మళ్లీ నవ్వులు వినిపించాలి.
ఎందుకంటే...ఇల్లు పెద్దదైతే కాదు...
ఇంట్లో మనుషులు కలిసుంటేనే అది ఇల్లు.
ఆస్తి ఎక్కువైతే కాదు...
అనుబంధం ఉంటేనే జీవితానికి పండుగ.
ఈ రాఖీకి చేతికి దారం కట్టడమే కాదు...
మనసులకు ప్రేమను కట్టుకుందాం.
అన్నా–చెల్లెళ్ల బంధంచివరి ఊపిరి దాకా
చెదరకుండా ఉండాలి...
అదే రాఖీ పండుగకు అసలైన అర్థం.



– కనకమామిడి సన్నీ. ..,

# భట్టి భేటీతో వేడెక్కిన కాంగ్రెస్ రాజకీయం

- కొండా మురళి కీలక వ్యాఖ్యలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కొండా మురళి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి భేటీ
- సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా పాల్గొనడంతో పెరిగిన ఉత్కంఠ
- కొండా సుస్మిత వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదన్న కొండా మురళి
- సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలపై పూర్తి విశ్వాసం ఉందని స్పష్టం
- తాము 100 శాతం కాంగ్రెస్ లోనే కొనసాగుతామని తేల్చిచెప్పిన కొండా మురళి





**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో:** తెలంగాణ కాంగ్రెస్‌లో కొండా సురేఖ వ్యవహారం వేడెక్కుతున్న వేళ కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కాంగ్రెస్ నేత, మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి హైదరాబాద్ ప్రజాభవన్‌లో సమావేశమయ్యారు. ఈ భేటీలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో పాటు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా పాల్గొనడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**క్రమశిక్షణ కమిటీ నివేదిక వేళ భేటీ..**

మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి సంబంధించిన వ్యవహారంపై కాంగ్రెస్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ ఇప్పటికే నివేదికను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు సమర్పించినట్లు సమాచారం. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడిన నేతలపై చర్యలు తీసుకోవాలని కమిటీ సిఫార్సు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కొండా మురళి, రాజగోపాల్‌రెడ్డి భట్టి విక్రమార్కతో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**సుస్మిత వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదు..**

భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన కొండా మురళి.. తన కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సుస్మితకు తన అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే హక్కు ఉందన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు తమను బాధ్యులను చేయడం సరికాదని పేర్కొన్నారు. క్రమశిక్షణ కమిటీకి చెప్పాల్సిన విషయాలను ఇప్పటికే వివరించామని తెలిపారు.

**కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదు..**

తమకు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై పూర్తి విశ్వాసం ఉందని కొండా మురళి తెలిపారు. తాము 100 శాతం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతామని స్పష్టం చేశారు. పార్టీని వీడే ఆలోచన తమకు లేదని తేల్చిచెప్పారు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఈ అంశంపై మరింతగా మాట్లాడబోనని చెప్పారు.

**భట్టి భేటీపై రాజకీయ వర్గాల్లో చర్చ..**

తాను ఒక బిల్లు విషయమై భట్టి విక్రమార్కను కలిశానని కొండా మురళి వివరణ ఇచ్చారు. ఈ సమావేశంలో కొండా సురేఖ, కొండా సుస్మిత వ్యవహారంపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. మరోవైపు రాజగోపాల్‌రెడ్డి కూడా భట్టి విక్రమార్కతో సమావేశం కావడంతో ఈ భేటీ వెనుక అసలు కారణాలపై కాంగ్రెస్ వర్గాల్లో రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే సమావేశంలో ఏ అంశాలపై చర్చ జరిగిందనే దానిపై అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడికాలేదు. కొండా సురేఖ వ్యవహారంపై పార్టీ అధిష్ఠానం తదుపరి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై ఇప్పుడు ఉత్కంఠ నెలకొంది.

# నేపాల్‌కు అండగా భారత్..
## ప్రధాని మోదీ కీలక హామీ

- నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ
- మెరుపు వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం
- సహాయక, రక్షణ చర్యలకు అన్ని విధాలా సహకరిస్తామని హామీ
- నేపాల్‌కు 10 టన్నుల సహాయ సామగ్రి, మందులు పంపించిన భారత్
- వరదల్లో 105 మంది భారతీయులు కొట్టుకుపోయినట్లు సమాచారం



**న్యూఢిల్లీ, ప్రజావాయిస్ బ్యూరో:** నేపాల్‌లో మెరుపు వరదలు సృష్టించిన బీభత్సంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో బుధవారం ఫోన్‌లో మాట్లాడిన మోదీ.. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలిపారు. అక్కడి పరిస్థితులపై ఆరా తీసి.. కష్టకాలంలో నేపాల్‌కు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

**బాలేంద్ర షాతో మోదీ ఫోన్ సంభాషణ.**

.నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో మాట్లాడిన విషయాన్ని ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. నేపాల్‌లో సంభవించిన వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలిపారు. ఈ కష్ట సమయంలో నేపాల్ ప్రజలకు భారతదేశ ప్రజలు అండగా ఉంటారని పేర్కొన్నారు. సహాయక, రక్షణ చర్యల్లో ఇరు దేశాల బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.

**నేపాల్‌లో వరద బీభత్సం..టిబెట్ వైపు నుంచి వచ్చిన మెరుపు వరదలతో భోటే**

కోశీ నది ఉద్ధృతంగా ప్రవహించింది.

మిగతా 2లో



# మూసీ పునరుజ్జీవంపై సీఎం రేవంత్ ఫోకస్
## పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు

- మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్ తొలి దశకు రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు
- నాగోల్ నుంచి గౌరెల్లి వరకు భూసేకరణ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశం
- జంట జలాశయాల నుంచి బాపూఘాట్ వరకు 21 కి.మీ.లో టీడీఆర్‌తో భూసేకరణ
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, అసైన్డ్ భూములపై స్పష్టమైన విధానంతో మాస్టర్ ప్లాన్
- గండిపేట ఓంకారేశ్వర ఆలయ అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు

హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో: మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రాజెక్టు తొలిదశ పనులకు రూ.7,345.12 కోట్లతో పరిపాలనా అనుమతులు జారీ కావడంతో పనులు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

**నాగోల్-గౌరెల్లి మధ్య పనులకు వేగం..**

నాగోల్ నుంచి గౌరెల్లి వరకు

మిగతా 2లో

# కస్తూర్బాలో 'వేధింపుల' కలకలం

- ఇద్దరు ఇంటర్ విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం
- లెక్చరర్ల తీరే కారణమంటూ విద్యార్థినుల ఆరోపణ
- ప్రశ్నలకు జవాబు చెప్పలేదని అరగంట నిలబెట్టిన వైనం
- రసాయనం తాగినా ఆస్పత్రికి తరలింపులో జాప్యం
- స్కూల్‌కు సంబంధం లేదు అంటూ లేఖ రాయించారని వెల్లడి
- ఘటనపై సమగ్ర విచారణకు కుటుంబ సభ్యుల డిమాండ్


2లో



# తారా్నకలో భారీగా డిఫెన్స్ మద్యం పట్టివేత .. 67 బాటిళ్లు స్వాధీనం

- తార్నాకలో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం ఆకస్మిక దాడులు
- మొత్తం 67 డిఫెన్స్ మద్యం బాటిళ్లు స్వాధీనం
- పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.2 లక్షలు
- కర్ణాటక, హర్యానా రాష్ట్రాలకు చెందిన బాటిళ్లుగా గుర్తింపు
- మాజీ సైనికుడి కుమారుడి అరెస్ట్.. ఎక్సైజ్ అధికారులకు అప్పగింత

2లో



# తెల్లవారుజామున.. తెల్లారిన బతుకులు..!

- కోదాడ వద్ద ఘోర బస్సు ప్రమాదం
- ఆరుగురి ప్రాణాలు గాల్లో కలిసిన విషాదం
- కంటైనర్ లారీ ఢీకొని 'అభి' ట్రావెల్స్ బస్సు బోల్తా
- ఆరుగురు దుర్మరణం
- 42 మంది ప్రయాణికులు.. 20 మందికి తీవ్ర గాయాలు
- కోదాడ, విజయవాడ ఆస్పత్రుల్లో క్షతగాత్రులకు చికిత్స
- ఘటనా స్థలికి కలెక్టర్ , ఎస్పీ
- సహాయక చర్యల పర్యవేక్షణ
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం: సీఎం, మంత్రులు



**ప్రజా వాయిస్, కోదాడ:** నిద్రమత్తులో సాగుతున్న ప్రయాణం.. ఒక్కసారిగా పెను విషాదంగా మారింది. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట సమీపంలో జాతీయ రహదారి–65పై బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అదుపుతప్పిన కంటైనర్ లారీ డివైడర్‌ను ఢీకొట్టి.. అనంతరం హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న 'అభి' ట్రావెల్స్ బస్సును బలంగా ఢీకొట్టింది. దీంతో బస్సు బోల్తాపడి ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం.

**ఆరు కుటుంబాల్లో అంతులేని రోదన**

ప్రమాదంలో సురవరపు షకీనా, యాసరపు చిన్ని, బొల్లిపంగు మేరీ జోష్నా, కేశవుల నాగేంద్రబాబు, కొండూరు భావన, పిడికిటి లక్ష్మీ మృతి చెందారు. క్షణాల్లో జరిగిన ఈ విషాదంతో మృతుల కుటుంబాలు కన్నీరుమున్నీరయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. తీవ్రంగా గాయపడిన పలువురిని మెరుగైన వైద్యం కోసం

మిగతా 2లో

# డిజిటల్ అరెస్ట్ పేరుతో 85 ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగికి టోకరా .. రూ.85.20 లక్షలు ఫ్రీజ్

- ఎన్ఐఏ అధికారినంటూ 85 ఏళ్ల రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగికి ఫోన్
- ఆధార్ వివరాలతో రూ.2.50 కోట్ల మోసం జరిగిందంటూ బెదిరింపులు
- ఆర్బీఐ వెరిఫికేషన్ పేరుతో రూ.85.20 లక్షలు జమ చేయించిన సైబర్ నేరగాడు
- మరో రూ.42 లక్షలు డిమాండ్ చేయడంతో బయటపడిన బాధితుడు
- అప్రమత్తమైన తెలంగాణ సైబర్ పోలీసులు.. మొత్తం రూ.85.20 లక్షలు ఫ్రీజ్

2లో



# తెల్లవారుజామున.. తెల్లారిన బతుకులు..!

మొదటి పేజీ తరువాయి
















విజయవాడకు తరలించారు.

**ఘటనాస్థలికి కలెక్టర్, ఎస్పీ**

ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, జిల్లా ఎస్పీ నరసింహ ఘటనాస్థలికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. అనంతరం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

**క్షతగాత్రులను పరామర్శించిన మల్లయ్య**

మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. వైద్యులతో మాట్లాడి అత్యవసర చికిత్సలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని కోరారు. తీవ్రంగా గాయపడిన వారికి అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**సీఎం, మంత్రుల దిగ్భ్రాంతి**

కోదాడ ప్రమాదంపై సీఎం ఎ. రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే ఎన్. ఉత్తమ్ పద్మావతి రెడ్డి కూడా ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, బాధితులకు అవసరమైన సహాయం అందేలా అధికారులతో సమన్వయం చేశారు.

**ఏపీ సీఎం, డిప్యూటీ సీఎం, లోకేశ్ విచారం**

ప్రమాదంపై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు చెందిన పలువురు మృతి చెందడం విషాదకరమన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కూడా ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసి బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

**కన్నీటిమయమైన ఎన్‌హెచ్-65**

ప్రమాదంతో ఎన్‌హెచ్–65పై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. తెల్లవారుజామున జరిగిన ఈ ఘోర ప్రమాదం కోదాడను ఒక్కసారిగా విషాదంలో ముంచెత్తింది. ఆరు కుటుంబాల్లో వెలుగులు ఆరిపోగా.. 20 మంది క్షతగాత్రులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# డిజిటల్ అరెస్ట్ పేరుతో 85 ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగికి టోకరా.. రూ.85.20 లక్షలు ఫ్రీజ్

**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో:** 'డిజిటల్ అరెస్ట్' పేరుతో సైబర్ నేరగాళ్లు 85 ఏళ్ల రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగిని మోసం చేసిన ఘటన హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చింది. ఎన్ఐఏ అధికారినంటూ ఫోన్ చేసిన సైబర్ నేరగాడు.. బాధితుడి ఆధార్ వివరాలతో రూ.2.50 కోట్ల మోసం జరిగిందంటూ భయపెట్టాడు. కేసు నుంచి బయటపడాలంటే ఆర్బీఐ వెరిఫికేషన్ అవసరమంటూ నమ్మించాడు.

**డిజిటల్ అరెస్ట్ పేరుతో 85 ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగికి టోకరా..**

రూ.85.20 లక్షలు ఫ్రీజ్★ ఎన్ఐఏ అధికారినంటూ 85 ఏళ్ల రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగికి ఫోన్★ ఆధార్ వివరాలతో రూ.2.50 కోట్ల మోసం జరిగిందంటూ బెదిరింపులు★ ఆర్బీఐ వెరిఫికేషన్ పేరుతో రూ.85.20 లక్షలు జమ చేయించిన సైబర్ నేరగాడు★ మరో రూ.42 లక్షలు డిమాండ్ చేయడంతో బయటపడిన బాధితుడు★ అప్రమత్తమైన తెలంగాణ సైబర్ పోలీసులు.. మొత్తం రూ.85.20 లక్షలు ఫ్రీజ్హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో: 'డిజిటల్ అరెస్ట్' పేరుతో సైబర్ నేరగాళ్లు 85 ఏళ్ల రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగిని మోసం చేసిన ఘటన హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చింది. ఎన్ఐఏ అధికారినంటూ ఫోన్ చేసిన సైబర్ నేరగాడు.. బాధితుడి ఆధార్ వివరాలతో రూ.2.50 కోట్ల మోసం జరిగిందంటూ భయపెట్టాడు. కేసు నుంచి బయటపడాలంటే ఆర్బీఐ వెరిఫికేషన్ అవసరమంటూ నమ్మించాడు.

**ఎన్ఐఏ అధికారినంటూ బెదిరింపులు..**

గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి తాను ఎన్ఐఏ అధికారినని పరిచయం చేసుకున్నాడు. బాధితుడి ధార్ వివరాలను ఉపయోగించి భారీగా ఆర్థిక మోసం జరిగిందని చెప్పాడు. దీంతో 85 ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగి తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కేసు నుంచి బయటపడేందుకు తమ సూచనలు పాటించాలని నిందితుడు ఒత్తిడి తెచ్చాడు.

**ఆర్బీఐ వెరిఫికేషన్ పేరుతో డబ్బు..**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెరిఫికేషన్ పేరుతో బాధితుడిని సైబర్ నేరగాడు నమ్మించాడు. తన బ్యాంక్ ఖాతాలో రూ.85.20 లక్షలు జమ చేయాలని సూచించాడు. నిందితుడి మాటలను నమ్మిన బాధితుడు అతను సూచించిన ఖాతాలో మొత్తం రూ.85.20 లక్షలను బదిలీ చేశాడు.

**మరో రూ.42 లక్షలు డిమాండ్..**

అనంతరం నిందితుడు మరో రూ.42 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడికి అనుమానం వచ్చింది. తాను సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించిన రిటైర్డ్ ఉద్యోగి వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు.

**అప్రమత్తమైన సైబర్ పోలీసులు..**

ఫిర్యాదుపై వెంటనే స్పందించిన తెలంగాణ సైబర్ పోలీసులు.. కోయంబత్తూరులోని ఓ ప్రైవేటు బ్యాంకు శాఖలో నిందితుడు ఉపయోగించిన ఖాతాను గుర్తించారు. అందులో ఉన్న రూ.85.20 లక్షలను వెంటనే ఫ్రీజ్ చేశారు. నిందితులను గుర్తించి పట్టుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోంది.

# కేసీఆర్ పాలన ప్రజల కేంద్రంగా.. రేవంత్ పాలన భూముల కేంద్రంగా: హరీశ్‌రావు

- రేవంత్ ప్రభుత్వం హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసిందని ఆరోపణ
- ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ అమ్మేస్తున్నారంటూ హరీశ్‌రావు విమర్శ
- ప్రజల ఆస్తులను 22-ఏలో.. ప్రభుత్వ భూములను రేవంత్ సోదరుల చేతుల్లోకి నెడుతున్నారని వ్యాఖ్య
- 22-ఏ పేరుతో ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుతూ కమీషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపణ
- సెప్టెంబర్ 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో 22-ఏపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని వెల్లడి

**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో:** కేసీఆర్ పాలన ప్రజల కేంద్రంగా సాగితే.. రేవంత్ పాలన భూముల కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో బుధవారం 22–ఏ బాధితులతో సమావేశమైన ఆయన.. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు.

**ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ అమ్మకాలు**

పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు.. ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ అమ్మేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రభుత్వ భూములన్నింటినీ విక్రయిస్తూ భావి తరాలకు జాగా లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ ప్రభుత్వం హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**22-ఏపై తీవ్ర ఆరోపణలు..**

ప్రజల ఆస్తులను 22–ఏ నిషేధిత జాబితాలోకి చేర్చి.. ప్రభుత్వ భూములను రేవంత్ సోదరుల చేతుల్లోకి నెడుతున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొని పారిశ్రామికవేత్తలకు కమీషన్ల కోసం విక్రయిస్తున్నారని విమర్శించారు. ఎప్పుడు హైడ్రా వస్తుందో.. ఎప్పుడు తమ భూమిని 22–ఏ కింద లాక్కుంటారోనని ప్రజలు భయపడుతున్నారని అన్నారు.

**కోటి ఎకరాలు 22-ఏలో చేర్చారు..**

రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను, హైదరాబాద్‌లో లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22–ఏ జాబితాలో చేర్చిందని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజలను బాధ్యులను చేస్తూ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని, ఈ క్రమంలో 30 శాతం వరకు కమీషన్లు వసూలు చేస్తున్నారని విమర్శించారు.

**అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం..**

సెప్టెంబర్ 7 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో 22–ఏ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్‌రావు ప్రకటించారు. భూముల వ్యవహారంలో బ్రోకర్లకు ప్రజలు ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దని సూచించారు. ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యత బీఆర్ఎస్‌దేనని స్పష్టం చేశారు.

# కస్తూర్బాలో 'వేధింపుల' కలకలం

మొదటి పేజీ తరువాయి



**ప్రజా వాయిస్,నల్లగొండ క్రైమ్:** నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి కస్తూర్బా విద్యాలయంలో ఇద్దరు ఇంటర్ ప్రథమ సంవ త్సరం విద్యార్థినులు రసాయనం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. లెక్చరర్ల వేధింపులు, తరగతి గదిలో పరుష పదజాలంతో దూషించడం, చదువులో వెనుకబడుతున్నామన్న ఒత్తిడే తమ నిర్ణయానికి కారణమని విద్యార్థినులు ఆరోపించారు. బాధితుల్లో ఆదిరాల వైష్ణవి దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. మరో విద్యార్థిని బాషిపాక భానును కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

**ప్రశ్నకు సమాధానం చెప్పలేదని..**

ఇంగ్లిష్ మీడియంలో పాఠాలు అర్థం కావడం లేదని వైష్ణవి తెలిపింది. జువాలజీ లెక్చరర్ అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోవడంతో సుమారు అరగంట పాటు నిలబెట్టి పనిష్మెంట్ ఇచ్చారని ఆరోపించింది. పలువురు లెక్చరర్లు పరుష పదజాలంతో దూషించేవారని పేర్కొంది.

**ఆస్పత్రికి తరలింపులో జాప్యం**

రసాయనం తాగి వాంతులు చేసుకున్నా పాఠశాల సిబ్బంది వెంటనే ఆస్పత్రికి తరలించలేదని వైష్ణవి ఆరోపించింది. కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాతే ఆస్పత్రికి తీసుకెళ్లారని తెలిపింది. రాత్రి సుమారు 7 గంటలకు దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నట్లు వెల్లడించింది.

**స్కూల్‌కు సంబంధం లేదు అంటూ లేఖ**

రసాయనం తాగిన ఘటనకు పాఠశాలకు ఎలాంటి సంబంధం లేదని, అక్కడ ఉండటం తమకు ఇష్టం లేదని పేర్కొంటూ తమతో లేఖ రాయించుకున్నారని వైష్ణవి ఆరోపించింది. ఘటన తమపై పడకుండా పాఠశాల సిబ్బంది ఈ విధంగా వ్యవహరించారని పేర్కొంది.

**చర్యలు తీసుకోవాలి**

తన సోదరి గతంలోనూ లెక్చరర్ల తీరుపై చెప్పిందని వైష్ణవి సోదరుడు చరణ్ తెలిపారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి.. విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్ఓ, లెక్చరర్లపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు

# నేపాల్‌కు అండగా భారత్.. ప్రధాని మోదీ కీలక హామీ

నువాకోట్, ధాడింగ్ జిల్లాల్లో వరదలు తీవ్ర బీభత్సం సృష్టించాయి. పలు గ్రామాలు, వంతెనలు, ప్రాజెక్టులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. రసువా జిల్లాలో బుధవారం ఉదయం సుమారు 1000 మంది వరద ప్రవాహంలో కొట్టుకుపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

**105 మంది భారతీయులు గల్లంతు..**

వరదల్లో కొట్టుకుపోయిన వారిలో 105 మంది భారతీయులు ఉన్నట్లు సమాచారం. భారీ వర్షాలు, వరదల కారణంగా నేపాల్‌లో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. బాధితులను రక్షించేందుకు అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేశారు.

# మూసీ పునరుజ్జీవంపై సీఎం రేవంత్ ఫోకస్ పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు

వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నందున ఈ ప్రాంతంలో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. జిల్లా కలెక్టర్లు సంబంధిత అధికారులతో సర్వేలు నిర్వహించి అవసరమైన భూమిని గుర్తించాలని ఆదేశించారు. హెచ్ఎండీఏ విధానం ప్రకారం భూసమీకరణ చేపట్టాలని సూచించారు.

**21 కి.మీ.లో టీడీఆర్‌తో భూసేకరణ..**

మొదటి దశలో జంట జలాశయాల నుంచి బాపూఘాట్ వరకు 21 కిలోమీటర్ల మేర నది ఇరువైపులా టీడీఆర్ సర్టిఫికెట్ల ద్వారా భూసేకరణ చేపట్టాలని సీఎం మరోసారి స్పష్టం చేశారు. ప్రస్తుతం టీడీఆర్‌కు మార్కెట్‌లో మంచి ధర ఉన్నందున ప్రజలకు అవగాహన కల్పించి భూములు ఇచ్చేలా ఒప్పించాలని అధికారులను ఆదేశించారు. టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఎంఆర్‌డీసీఎల్, జీహెచ్‌ఎంసీ, సీఎంసీ అధికారులకు సూచించారు.

**భూములపై స్పష్టమైన మాస్టర్ ప్లాన్..**

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, అసైన్డ్ భూములకు సంబంధించి భవిష్యత్తులో చట్టపరమైన సమస్యలు తలెత్తకుండా స్పష్టమైన విధానంతో మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సీఎం ఆదేశించారు. టీడీఆర్ బాండ్ల జారీపై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని సూచించారు. ప్రాజెక్టు అభివృద్ధి పనులకు తక్కువ వడ్డీ రుణాలను సమీకరించడంపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.

**ఎకో పార్క్, ఓంకారేశ్వర ఆలయంపై సమీక్ష..**

కొత్వాల్‌గూడ ఎకో పార్కుకు మరింత ప్రాచుర్యం కల్పించాలని హెచ్ఎండీఏ అధికారులను సీఎం కోరారు. గండిపేట జలాశయం వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణంపైనా సమీక్ష నిర్వహించారు. ఆలయ నిర్మాణం, రహదారి విస్తరణ, ద్వీపం అభివృద్ధి, 100 అడుగుల శివుని విగ్రహం వంటి పనులను ఒకేసారి టెండర్ చేయాలని నిర్ణయించారు. మాస్టర్ ప్లాన్ దాదాపు సిద్ధమైందని, పది రోజుల్లో టెండర్లు పిలుస్తామని అధికారులు సీఎంకు వివరించారు.

**మూసీ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయాలి..**

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనులు వేగంగా ముందుకు సాగేలా సమన్వయంతో పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో సీఎం కార్యదర్శితో పాటు హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, నగరపాలక సంస్థల కమిషనర్లు, జిల్లా కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# వేములవాడ గోశాలలో ఐదు కోడెల మృతి.. నిర్లక్ష్యం ఉంటే చర్యలు

- ఆది శ్రీనివాస్
- తిప్పాపూర్ గోశాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించిన ప్రభుత్వ విప్
- కోడెలకు అందుతున్న ఆహారం, వైద్యం, సంరక్షణపై అధికారుల నుంచి వివరాలు
- సిబ్బంది నిర్లక్ష్యం తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- కొత్తగా వచ్చే కోడెలను ప్రత్యేక క్వారంటైన్‌లో ఉంచాలని ఆదేశం
- 40 ఎకరాల్లో ఆధునిక గోశాల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని వెల్లడి

**వేములవాడ, ప్రజావాయిస్ బ్యూరో:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ తిప్పాపూర్ గోశాలలో ఐదు కోడెలు మృతి చెందిన ఘటనపై తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. గోశాల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడెల సంరక్షణ, నిర్వహణ విషయంలో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.

**గోశాలలో పరిస్థితుల పరిశీలన..**

ఐదు కోడెల మృతి నేపథ్యంలో బుధవారం తిప్పాపూర్ గోశాలను ఆది శ్రీనివాస్ సందర్శించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించి.. కోడెలకు అందుతున్న ఆహారం, వైద్య సేవలు, సంరక్షణపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భక్తుల విశ్వాసానికి అనుగుణంగా గోశాల నిర్వహణ జరగాలని స్పష్టం చేశారు.

**కొత్త కోడెలకు క్వారంటైన్ తప్పనిసరి..**

భక్తులు సమర్పించే నిజ కోడెలను గోశాలకు తీసుకువచ్చిన వెంటనే ప్రత్యేక క్వారంటైన్‌లో ఉంచాలని అధికారులను ఆదేశించారు. వాటి ఆరోగ్య పరిస్థితిని పూర్తిగా పరిశీలించిన తర్వాతే ఇతర కోడెలతో కలపాలని సూచించారు. దీని వల్ల వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు.

**40 ఎకరాల్లో ఆధునిక గోశాల..**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు 40 ఎకరాల్లో ఆధునిక గోశాల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని ఆది శ్రీనివాస్ వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న కోడెల సంఖ్యకు అనుగుణంగా గోశాల సామర్థ్యాన్ని పెంచుతున్నామని చెప్పారు. అవసరమైన మేరకు కోడెలను ఇతర ప్రాంతాలకు తరలించాలని అధికారులకు సూచించారు.

**పాలు మానేసిన కోడెలనే సమర్పించాలి..**

పాలు మానేసిన కోడెలను మాత్రమే భక్తులు స్వామివారికి సమర్పించాలని ఆది శ్రీనివాస్ సూచించారు. గోశాలలో కోడెలకు మెరుగైన సంరక్షణ అందించడంతో పాటు భక్తుల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా నిర్వహణ ఉండాలని స్పష్టం చేశారు.

**మృతికి కారణాలపై విచారణ..**

ఐదు కోడెల మృతికి గల కారణాలపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఘటనపై సమగ్రంగా పరిశీలించి బాధ్యులెవరనేది తేల్చాలని సూచించారు. సిబ్బంది నిర్లక్ష్యం నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు.

# తార్నాకలో భారీగా డిఫెన్స్ మద్యం పట్టివేత .. 67 బాటిళ్లు స్వాధీనం

**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో:** నగరంలోని తార్నాక ప్రాంతంలో డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో భారీగా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుంది. మొత్తం 67 బాటిళ్లను పట్టుకున్న అధికారులు.. వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని తెలిపారు.

**సమాచారం ఆధారంగా దాడులు..**

తార్నాకలో ఓ వ్యక్తి డిఫెన్స్ మద్యం బాటిళ్లను అక్రమంగా విక్రయిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంకు సమాచారం అందింది. దీంతో బుధవారం సంబంధిత ఇంటిపై అధికారులు దాడి చేశారు. తొలుత ఇంటి యజమాని వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

**సోదాల్లో మరో 57 బాటిళ్లు..**

అనంతరం ఇంట్లో విస్తృతంగా సోదాలు నిర్వహించగా మరో 57 మద్యం బాటిళ్లు గుర్తించారు. దీంతో మొత్తం 67 బాటిళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మద్యం విలువ దాదాపు రూ.2 లక్షలు ఉంటుందని ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం వెల్లడించింది.

**కర్ణాటక, హర్యానాకు చెందిన మద్యం..**

స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు కర్ణాటక, హర్యానా రాష్ట్రాలకు చెందినవిగా అధికారులు గుర్తించారు. డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని మాజీ సైనికుడి కుమారుడు ఆర్. మాధవన్‌గా గుర్తించినట్లు తెలిపారు.

**ఎక్సైజ్ అధికారులకు అప్పగింత..**

ఆర్. మాధవన్‌ను అదుపులోకి తీసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తదుపరి విచారణ కోసం సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. డిఫెన్స్ మద్యం అక్రమ విక్రయాలపై మరింత విచారణ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.



# కోదాడలో గంజాయి గ్యాంగ్ అరెస్ట్

- 1.1 కిలోల గంజాయి పట్టివేత
- బోడిగుట్ట వద్ద నలుగురు అరెస్ట్
- 3 బైక్ లు.. 3 సెల్ ఫోన్లు స్వాధీనం
- బీహార్ నుంచి గంజాయి సరఫరా
- పంకజ్ కోసం పోలీసుల గాలింపు

**ప్రజా వాయిస్, కోదాడ:** గంజాయి అక్రమ విక్రయాలపై కోదాడ టౌన్ పోలీసులు కొరడా ఝుళిపించారు. అనంతగిరి రోడ్డులోని బోడిగుట్ట వద్ద మంగళవారం సాయంత్రం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి విక్రయానికి వచ్చిన సాలె వేణు, ఉల్లెందుల సుదర్శన్ @ సాహుతోపాటు కొనుగోలు చేసేందుకు వచ్చిన పోలంపల్లి సాయి సుమంత్, రెళ్ళ గోపిని పోలీసులు పట్టుకున్నారు.వారి వద్ద తనిఖీ చేయగా 1.1 కిలోల గంజాయి లభించింది. దీంతోపాటు గంజాయి ప్యాకింగ్ సామగ్రి, రవాణాకు ఉపయోగించిన మూడు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బీహార్‌కు చెందిన పంకజ్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి కోదాడ పరిసర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.1,000కు విక్రయిస్తున్నట్లు నిందితులు తెలిపినట్లు కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గంజాయి సరఫరాదారు పంకజ్ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై నిఘా కొనసాగుతుందని పోలీసులు తెలిపారు. ఈ పట్టణ సీఐ శివశంకర్, ముగ్గురు ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# తొర్రూరు లో వెంచర్ల దందా

- అధికారుల మౌనం ఎందుకు?
- ఆర్టీఐ లో 24 ఎకరాలే అంటున్న అధికారులు
- క్షేత్రస్థాయిలో లెక్కకు మించిన వెంచర్లు!
- అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారు?
- రియల్ ఎస్టేట్ నిర్వాహకులపై చర్యలేవీ..?
- మున్సిపాలిటీ అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారా?
- మున్సిపల్ రికార్డుల్లోకి ఎక్కని వెంచర్ల పై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్






**ప్రజా వాయిస్/తొర్రూర్ (పాలకుర్తి)** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మున్సిపాలిటీ, రెవెన్యూ పరిధిలో రియల్ ఎస్టేట్ వెంచర్ల వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2018 నుంచి 2026 వరకు రియల్ ఎస్టేట్ వెంచర్లకు సంబంధించి సమాచార హక్కు చట్టం ద్వారా కోరిన సమాచారానికి అధికారులు ఇచ్చిన వివరాల ప్రకారం కేవలం 24 ఎకరాల భూమిలోనే వెంచర్లు నమోదైనట్లు సమాచారం వెలుగులోకి వచ్చింది. రూపిరెడ్డి కృష్ణారెడ్డి తండ్రి ప్రతాప్ రెడ్డి పైన రియల్ ఎస్టేట్ నడుస్తున్నట్టుగా సమాచారం ఇచ్చారు వీరి పేరు మీద మూడెకరాల మూడు గుంటలుగా సమాచారం ఇచ్చారు ఈ యొక్క సర్వే నంబర్లు లో 31 ప్లాట్లు విక్రయించినట్లుగా గుర్తించారు. మరో రియల్ ఎస్టేట్ పేరు ఆర్ రామ చంద్రారెడ్డి మరియు ఇతరులు ఈ సర్వే నంబర్లు లో దాదాపుగా ఇరవై ఒక్క ఎకరం గా గుర్తించి ఈ యొక్క సర్వే నంబర్లు లో దాదాపుగా 290 ప్లాట్లు విక్రయించినట్టుగా మున్సిపాలిటీ అధికారులు సమాచార హక్కు చట్టం ప్రకారం ఇవ్వడం జరిగింది.అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని స్థానికులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. తొర్రూర్ పట్టణ చుట్టుపక్కల అనేక ప్రాంతాల్లో వెంచర్లు వెలుస్తున్నప్పటికీ వాటిలో కొన్ని మున్సిపల్ రికార్డుల్లో నమోదు కాలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఆర్టీఐలో(సమాచార హక్కు చట్టం) 24 ఎకరాలే అని సమాచారం ఇస్తే.. మరి కళ్లముందు కనిపిస్తున్న మిగతా వెంచర్లు ఎవరి అనుమతుల తో ఏర్పాటవుతున్నాయి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.అనుమతులు లేకుండా లేఅవుట్లు ఏర్పాటు చేస్తుంటే సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారా? లేక రాజకీయ నాయకుల ఒత్తిళ్ళక లేక రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంచర్ నిర్వాహకుల నుంచి అధికారులకు ఏమైనా ముడుపులు అందుతున్నాయా?అనే ఆరోపణలు కూడా ప్రజల్లో వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలు వాస్తవమా కాదా అన్నది ఉన్నతాధికారులు సమగ్ర విచారణ ద్వారా తేల్చాల్సిన అవసరం ఉంది.మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా నిద్ర వ్యవస్థ వీడి క్షేత్రస్థాయిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని 2018 నుంచి ఇప్పటివరకు ఏర్పాటైన ప్రతి వెంచర్ కు సంబంధించిన అనుమతులు, లేఅవుట్ ప్లాన్‌లు, భూమి వివరాలు, రిజిస్ట్రేషన్లు, మున్సిపల్ రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.అనుమతులు లేని వెంచర్ల పై చర్యలు తీసుకోకుండా మౌనం వహించే అధికారులపై కూడా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజల నుండి డిమాండ్ వినిపిస్తుంది.రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమాలకు అధికారులు అండగా నిలిచార నే ఆరోపణలు వినిపిస్తున్నాయి.నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధార మైతే వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలి అని డిమాండ్ చేస్తున్నారు.తొర్రూరు లో అసలు ఎన్ని వెంచర్లు ఉన్నాయి? వాటిలో ఎన్ని చట్టబద్ధమైనవి? ఎన్ని అనుమతులు లేకుండా వెలిశాయి? మున్సిపల్ రికార్డుల్లో ఎన్ని నమోదయ్యాయి? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిగితేనే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రజల జీవితకాల పొదుపులతో ప్లాట్లు కొనుగోలు చేసే పరిస్థితి ఉన్నందున అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం వీడి పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

# డైనమిక్ ఆఫీసర్‌కు అభినందనలు

- పాలకుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ జానకి రామ్ రెడ్డి పాలకుర్తి సబ్ ఇన్స్పెక్టర్ దూలం పవన్ కుమార్

**ప్రజా వాయిస్/పాలకుర్తి** ఐపీఎస్ గా పదోన్నతి పొందిన డైనమిక్ ఆఫీసర్ జనగామ జిల్లా డీసీపీ రాజమహేంద్ర నాయక్‌ను పాలకుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జానకీరామ్‌రెడ్డి, ఎస్ఐ దూలం పవన్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖలో తనదైన శైలిలో విధులు నిర్వర్తిస్తూ డైనమిక్ అధికారిగా గుర్తింపు పొందిన రాజమహేంద్ర నాయక్‌ను ఈ సందర్భంగా వారు అభినందించారు. ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో ముందుండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పలిమెలలో 'ఆలయ' నిరీక్షణ!

- స్థలం కేటాయించినా కదలని అడుగులు
- నిధుల కొరతతో పడకేసిన పనులు
- అడవి బాట పడుతున్న హనుమాన్ భక్తులు
- దాతలు, ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి

**ప్రజా వాయిస్ పలిమెల** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మండల కేంద్రంలో దేవాలయం లేక భక్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏళ్లుగా ఆలయ నిర్మాణం కోసం ఎదురుచూస్తున్నా అధికారుల నిర్లక్ష్యం, నిధుల కొరత వల్ల పనులు ముందుకు సాగడం లేదు.

### అడవిలోనే పూజలు.. తప్పని తిప్పలు

పలిమెలలో ప్రత్యేక ఆలయం లేకపోవడంతో హనుమాన్ భక్తులు ప్రతి ఏడాది చందాలు సేకరించి బొడాయిగూడెం అటవీ ప్రాంతంలోని పాత హనుమాన్ ఆలయం వద్దే తాత్కాలిక ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే ఈ ఆలయం అడవిలో ఉండటంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### స్థలం ఇచ్చినా.. నిధులేవి?

మండల కేంద్రంలోనే ఆలయం నిర్మించాలని గతంలో ప్రజలు ప్రజాప్రతినిధులకు విన్నవించగా, వారు స్పందించి స్థలాన్ని కేటాయించారు. అయితే స్థలం కేటాయించి ఏళ్లు గడుస్తున్నా నిధులు మంజూరు కాకపోవడంతో నిర్మాణ పనులు అడుగు కూడా ముందుకు పడటం లేదు.దాతలు ముందుకు రావాలిమండల కేంద్రంలో ఆలయం పూర్తయితే ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందని, భక్తులకు పూజలు చేసుకునే వెసులుబాటు కలుగుతుందని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, దాతలు స్పందించి అవసరమైన నిధులు సమకూర్చి, ఆలయ నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించాలని పలిమెల ప్రజలు, హనుమాన్ భక్తులు కోరుతున్నారు.




## పాపన్నపేట ఎఫ్ సి ఐ గోదా ఇన్చార్జ్ ఇష్టారాజ్యం?
- గడువు ముగుస్తున్న రేషన్ డీలర్లకు పంపిణీ చేయని పీడీఎస్ బియ్యం?
- గ్రామాలలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రేషన్ డీలర్లు

# ప్రజా వాయిస్ ఎఫెక్ట్..

- అధికారుల స్పందన!
- పాపన్నపేట ఎఫ్‌సీఐ గోదాం నుంచి రేషన్ డీలర్లకు బియ్యం సరఫరా
- మూడు నెలల బియ్యం పంపిణీకి చర్యలు.. లబ్ధిదారుల్లో ఆనందం

**పాపన్నపేట, ప్రజా వాయిస్:** పాపన్నపేట ఎఫ్‌సీఐ గోదాం ఇన్‌చార్జి ఇష్టారాజ్యం పేరుతో రేషన్ బియ్యం సరఫరాలో జరుగుతున్న జాప్యంపై ప్రజా వాయిస్ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీంతో ఎఫ్‌సీఐ గోదాం నుంచి రేషన్ డీలర్లకు బియ్యం సరఫరా ప్రక్రియ వేగం పుంజుకుంది.ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన మూడు నెలల పీడీఎస్ బియ్యాన్ని రేషన్ డీలర్లకు అందించే ప్రక్రియను అధికారులు చేపట్టారు. దీంతో ఇప్పటివరకు బియ్యం కోసం ఎదురుచూస్తున్న రేషన్ డీలర్లకు ఊరట లభించింది.మూడు నెలల బియ్యం.. లబ్ధిదారులకు ఊరటపాపన్నపేట, టేక్మాల్ మండలాల పరిధిలోని రేషన్ డీలర్లకు మూడు నెలలకు సంబంధించిన బియ్యం సరఫరా చేస్తుండటంతో తెలుపు రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. సకాలంలో బియ్యం అందితే తమకు ఇబ్బందులు ఉండవని లబ్ధిదారులు పేర్కొంటున్నారు.కథనంతో కదిలిన యంత్రాంగంరేషన్ బియ్యం సరఫరాలో జాప్యంపై రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజా వాయిస్ వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు స్పందించడం పట్ల డీలర్లు, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా మూడు నెలల బియ్యాన్ని పూర్తిస్థాయిలో సరఫరా చేసి, ప్రతి అర్హుడైన లబ్ధిదారుడికి రేషన్ బియ్యం అందేలా చర్యలు కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

# అద్వానంగా రహదారి.... ప్రయాణం ప్రమాదకరమే

- గుంతల రోడ్డులో నాట్లు వేసి నిరసన తెలిపిన మాచిన్‌పల్లి గ్రామస్తులు

**దౌల్తాబాద్, ఆగస్టు 26:** దౌల్తాబాద్ మండలంలోని మాచిన్‌పల్లి గ్రామంలో రహదారి అధ్వానంగా మారడంతో గ్రామస్తులు రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలవడంతో వాటిలో నాట్లు వేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు.మాచిన్‌పల్లి నుంచి దౌల్తాబాద్ మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి చాలాకాలంగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో పలుచోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయని గ్రామస్తులు తెలిపారు. వర్షం కురిసినప్పుడు గుంతల్లో నీరు నిలిచి రహదారి పరిస్థితి మరింత దారుణంగా మారుతోందన్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

### మండల కేంద్రానికి వెళ్లాలంటే అవస్థలే

విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు నిత్యం ఈ రహదారిపైనే ప్రయాణించాల్సి వస్తోందని గ్రామస్తులు తెలిపారు. గుంతల కారణంగా వాహనాలు నెమ్మదిగా నడపాల్సి వస్తోందని, ప్రయాణ సమయం పెరుగుతోందన్నారు. రాత్రివేళల్లో గుంతలు కనిపించక ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు సైతం రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.

### వెంటనే మరమ్మతులు చేపట్టాలి

రహదారి సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని గ్రామస్తులు ఆరోపించారు. ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో గుంతల్లో నాట్లు వేసి నిరసన చేపట్టాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని పరిశీలించి గుంతలను పూడ్చడంతో పాటు నాణ్యమైన రహదారి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.





# మానవత్వం మరచిన కాఖీలు

- నాగర్ కర్నూల్ జిల్లాలో సంచలనం రేపుతున్న ఘటన
- నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట పోలీస్ స్టేషన్లో మానవత్వం మరిచిపోయి మూత్ర విసర్జన చేసిన ఎస్.ఐ
- బాధితుడు మహేందర్ ఆరోపణ
- పాలమూరు మహేందర్ ను అకారణంగా కొట్టిన తిమ్మాజిపేట్ ఎస్సై మరియు ఇద్దరూ కానిస్టేబుల్ లను విధుల నుండి తొలగించాలనీ - బిఎస్పీ డిమాండ్.






**ప్రజా వాయిస్ ఆగస్టు 26 నాగర్ కర్నూల్ జిల్లా** తిమ్మాజీపేట బహుజన సమాజ్ పార్టీ(బిఎస్పీ) ఆధ్వర్యంలో తిమ్మాజిపేట్ ఎస్సై చేతిలో దారుణంగా కొట్టబడి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకోవడానికి వచ్చిన పాలమూరు మహేందర్ ని పరామర్శించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ మాట్లాడుతూ తిమ్మాజిపేట్ పోలీస్ స్టేషన్ లో జరిగిన అమానుష సంఘటనను బిఎస్పీ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. ఎంక్వయిరీ కోసం పిలిచిన బాధిత పాలమూరు నరేందర్ ను పోలీస్ స్టేషన్ లో తిమ్మాజిపేట్ ఎస్సై తీవ్రంగా కొట్టడం హేయనీయం అన్నారు. అట్లాగే బాధితుడు చెప్తున్న దాని ప్రకారం నిన్న విధుల్లో ఉన్న ఒక కానిస్టేబుల్ మహేందర్ మెడల మీద కాలుపెడితే, ఎస్సై మూత్ర విసర్జన చేయడం అమానుషం అన్నారు. ఇట్టి సంఘటనను బిఎస్పీ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. ఇ ఘటనకు కారణమైన తిమ్మాజిపేట్ ఎస్సై, ఇద్దరి కానిస్టేబుల్ లను తక్షణమే విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ (MLC)ఇవ్వకుండా, మహేందర్ కుటుంబానికి రక్షణ కల్పించకుండా ఉండటం సమంజసం కాదన్నారు. బాధిత మహేందర్ కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించాలని, పోలీస్ రక్షణ సమక్షంలో బాధితునికి ట్రీట్మెంట్ జరగాలని అన్నారు. బాధిత మహేందర్ ఆరోగ్యం కుదుటపడిన తర్వాత జిల్లా ఎస్పీ గారి దృష్టికి ఇ విషయాన్ని తీసుకుని వెళ్తామని పేర్కొన్నారు. అప్పటిదాక ఫ్రీ అండ్ ఫెయిర్ ఎంక్వయిరీ జరగాలని కోరారు. నాగర్ కర్నూల్ ఎమ్మెల్సీ గారి దృష్టిలో కూడా ఇ విషయం ఉంచినట్లు బాధితులు తెలిపారు. ఎమ్మెల్సీ గారు కూడా స్పందించి ఆ కుటుంబానికి అండగా నిలవాలన్నారు. బాధిత మహేందర్ తో పాటు పోలీస్ స్టేషన్ కి వెళ్లిన వారిని కూడా పోలీస్ స్టేషన్ ఆవరణలో మాజీ సర్పంచ్ వర్గం వాళ్ళు బెదిరించి, గొంతు పట్టుకోవడంపై మండిపడ్డారు. పోలీస్ స్టేషన్ ఆవరణలలో ఇలాంటి సంఘటనలు మళ్ళీ పునరావృత్తం కాకుండా జిల్లా అధికారులు చూడాలని మాట్లాడారు. ఇ కార్యక్రమంలో పార్లమెంట్ ఇంచార్జ్ సి.కళ్యాణ్, జిల్లా ఈసీ మెంబర్ బాలస్వామి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ హర్ష ముదిరాజ్, అసెంబ్లీ అధ్యక్షులు పరుశరామ్, అసెంబ్లీ కమిటీ కార్యదర్శి మధు, తిమ్మాజిపేట్ మండల అధ్యక్షులు శంకర్, తాడూర్ మండల అధ్యక్షులు ఆంజనేయులు, సెక్టార్ అధ్యక్షులు రాముడు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో అపరిశుభ్ర తాగునీరు

- ప్రయాణికుల ఆరోగ్యంతో చెలగాటమా?
- పరిశుభ్రమైన తాగునీరు అందించాలి: ఏఐఎఫ్‌డీఎస్ డిమాండ్
- బస్టాండ్‌లో వాటర్ ట్యాంక్, మరుగుదొడ్ల దుస్థితిపై ఆగ్రహం
- సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తప్పవని పోతుగంటి కాశి హెచ్చరిక



**ప్రజా వాయిస్,మిర్యాలగూడ**.మిర్యాలగూడ పట్టణ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి వాటర్ ట్యాంక్ పూర్తిగా అపరిశుభ్రంగా ఉండటంపై అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వాటర్ ట్యాంక్ పైభాగం ఖాళీగా ఉండటంతో క్రిమికీటకాలు, పురుగులు, ఇతర వ్యర్థాలు అందులో పడే అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి పర్యవేక్షణ చేపట్టడం లేదని ఏఐఎఫ్‌డీఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోతుగంటి కాశి ఆరోపించారు.అదే ట్యాంక్ నుంచి పైపుల ద్వారా ఫ్రిడ్జ్‌లోకి నీరు చేరుతుందని, ఆ నీటినే ప్రయాణికులు తాగుతున్నారని ఆయన తెలిపారు. దీంతో ప్రయాణికుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం కూడా పూర్తి స్థాయిలో అపరిశుభ్రంగా, అధ్వాన్న స్థితిలో ఉందని అన్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లను సైతం సక్రమంగా శుభ్రం చేయడం లేదని, ఉన్నతాధికారుల సరైన పర్యవేక్షణ లేకపోవడంతో బస్టాండ్ ఇష్టా రాజ్యంగా మారిందని విమర్శించారు.బుధవారం మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా వెంటనే అపరిశుభ్రమైన వాటర్ ట్యాంక్‌ను శుభ్రపరిచి, మూత ఏర్పాటు చేసి పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ప్రయాణికుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పోతుగంటి కాశి హెచ్చరించారు.

# వృద్ధాశ్రమ స్థలానికి 'కబ్జా' ముప్పు?






- గౌతమినగర్‌లో వృద్ధాశ్రమం కోసం కేటాయించిన స్థలంపై కన్నేసిన భూబకాసూరులు
- 2012లోనే భూమిపూజ చేసిన పూర్వ నేతలు
- అయినా అటకెక్కిన నిర్మాణం
- ఆక్రమణలకు దారితీస్తున్న వైనం
- ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని స్థానికుల డిమాండ్

**ప్రజా వాయిస్ గోదావరిఖని** వృద్ధుల ఆశ్రయం కోసం ఏళ్లకు క్రితం కేటాయించిన స్థలానికి ఇప్పుడు కబ్జా ముప్పు పొంచి ఉందన్న ప్రచారం కలకలం రేపుతోంది. ఎఫ్‌సిఐ క్రాస్‌రోడ్స్ సమీపంలోని గౌతమినగర్ మార్గంలో ఉద్దేశించిన 'గౌతమి వృద్ధాశ్రమం స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు 'జనహిత' ప్రతినిధులు, స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లోనే అంగరంగ వైభవంగా గౌతమినగర్ ఎక్స్-సర్వీస్‌మెన్ కాలనీ సమీపంలో 2012 నవంబర్ 18న అప్పటి ఎంపీ డాక్టర్ జి. వివేకానంద, అప్పటి ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ సమక్షంలో గౌతమి వృద్ధాశ్రమ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ స్థలంలో వృద్ధులకు సురక్షిత ఆశ్రయం కల్పించాలని సంకల్పించినా.. కాలక్రమేణా పనులు మూలనపడ్డాయి.

### మంజూరైన నిధులు ఏమైనట్లు?

గతంలో కాంట్రాక్టర్ల ద్వారా ఈ వృద్ధాశ్రమ నిర్మాణానికి నిధులు కూడా మంజూరైనట్లు ప్రచారం జరిగింది. స్థలం పక్కనే ఉన్న సాయిబాబా గుడి, వైపుగా పైన ఉన్న హెచ్‌టీ విద్యుత్ లైన్ల నిబంధనలకు అనుగుణంగా నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే నిధుల మంజూరు ప్రక్రియ జరిగినప్పటికీ, భవన నిర్మాణం మాత్రం పూర్తికాలేదు.

### ఆర్‌ఎఫ్‌సీఎల్ ఆగమనంతో కబ్జాదారుల కన్ను

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ పరిశ్రమ పునరుద్ధరణ తర్వాత ఈ ప్రాంతంలో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో ఎంతో విలువైన ఈ వృద్ధాశ్రమ ఖాళీ స్థలంపై పలువురు వ్యాపారులు, ఆక్రమణదారుల కన్ను పడింది. స్థలంలో నుంచి రోడ్డు మార్గాన్ని మళ్లించడం, ఇతర అక్రమ కట్టడాలకు యత్నించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలి

ప్రజా ప్రయోజనాల కోసం, వయోవృద్ధుల సంక్షేమం కోసం కేటాయించిన ఈ స్థలాన్ని మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తక్షణమే కాపాడాలని 'జనహిత' ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ఈ స్థలం మున్సిపాలిటీకి చెందినదా లేక ఏ ఇతర సంస్థదా అని స్పష్టం చేస్తూ, ఇచ్చిన నిధులతో వృద్ధాశ్రమ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

# 15 కోట్లతో ఓదెల ఆలయ పునర్నిర్మాణం

- భక్తుల వసతి కోసం 22 గదుల సముదాయం
- ఓదెల మల్లికార్జున స్వామి ఆలయానికి మహర్దశ

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు. ఆలయాన్ని దశలవారీగా అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. బుధవారం ఓదెల మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించిన విజయరమణ రావు ముందుగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాదాయ శాఖ స్థపతితో కలిసి ఆలయ ప్రాంగణంలో చేపట్టనున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. దాతల సహకారంతో నిర్మించనున్న భక్తుల 22 వసతి గృహాల సముదాయానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా విజయరమణ రావు మాట్లాడుతూ ఇప్పటికే రూ.1.30 కోట్లతో రోడ్లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఆలయ పునర్నిర్మాణానికి సుమారు రూ.15 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా నూతన గోపురాలు, రాతి శిల్పాలతో ప్రాకారం నిర్మించి ఆలయాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు.అలాగే పర్యాటక శాఖ ద్వారా మరో రూ.8 కోట్ల నిధులు మంజూరు కానున్నాయని విజయరమణ రావు తెలిపారు. భవిష్యత్‌లో ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను దశలవారీగా ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, ఈఓ, గ్రామ సర్పంచ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# నేడు అన్ని గ్రామాల్లో ఎస్ఐఆర్‌పై గ్రామసభలు

- ఉదయం 10 గంటలకు పోలింగ్ కేంద్రాల పరిధిలో సమావేశాలు

**ప్రజా వాయిస్, శంకరంపేట:** ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం (ఆగస్టు 27) శంకరంపేట మండలంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎస్ఐఆర్‌కు సంబంధించి గ్రామసభలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ గ్రామసభలు ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో జరుగుతాయని ఎమ్మార్వో నారాయణ తెలిపారు.ఎస్ఐఆర్‌కు సంబంధించిన అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వివరాలను తెలియజేయనున్నట్లు తెలిపారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై గ్రామసభలను విజయవంతం చేయాలని ఎమ్మార్వో నారాయణ కోరారు.




# మీలాద్ సందేశం.. మిర్యాలగూడలో సోదరభావం

- ప్రవక్త మహమ్మద్ బోధనలు శాంతి, ప్రేమ, కరుణకు మార్గదర్శకం
- .అన్ని మతాలు, వర్గాల ప్రజల ఐక్యతే మిర్యాలగూడ ప్రత్యేకత
- ముస్లిం సోదరులతో కలిసి మీలాద్-ఉన్-నబీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజా వాయిస్,మిర్యాలగూడ**. మిర్యాలగూడ పట్టణంలోని ఇస్లాంపురం 47వ వార్డులో ముస్లిం సోదరులు నిర్వహించిన పవిత్ర మీలాద్-ఉన్-నబీ పర్వదిన వేడుకల్లో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (BLR) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రవక్త మహమ్మద్ గారి బోధనలు మానవాళికి శాంతి, సోదరభావం, ప్రేమ, కరుణ, ఐక్యత వంటి గొప్ప విలువలను అందించాయని ఎమ్మెల్యే BLR పేర్కొన్నారు. ఆ బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.మిర్యాలగూడ నియోజకవర్గంలో అన్ని మతాలు, వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో, సోదరభావంతో కలిసి మెలిసి జీవించేలా కృషి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. ప్రజలందరి సంక్షేమం, శాంతి, సౌభ్రాతృత్వమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.అనంతరం నిర్వహించిన మిఠాయి పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి పర్వదిన ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ముస్లిం మత పెద్దలు, యువకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ పేరుతో నమ్మించి!!

- గర్భవతిని చేసి పెళ్లికి నిరాకరించిన సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్
- పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతి అయిన తర్వాత మాట మార్చాడంటూ యువతి ఆవేదన
- ఇంటి ముందు ఘర్షణ
- పోలీస్‌స్టేషన్‌కు చేరిన వివాదం
- బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు



**ప్రజా వాయిస్ బూర్గంపాడు** బూర్గంపాడు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఆమె గర్భవతి అయిన అనంతరం పెళ్లికి నిరాకరించాడనే ఆరోపణలతో వివాదం చోటుచేసుకుంది. ఈ ఘటన స్థానికంగాచర్చనీయాంశంగా మారింది.వివరాలలోకి వెళ్తే బూర్గంపాడు గ్రామం లోని ఎస్సీ కాలనీకి చెందిన తోకల సాయి (28),మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఢిల్లీలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మొరంపల్లి బంజర గ్రామానికి చెందిన ధార శివాని (26),మాదిగ సామాజిక వర్గానికి చెందిన యువతి ప్రైవేట్ నర్సుగా పనిచేస్తుంది. సాయి, శివానిలకు గత మూడు సంవత్సరాలుగా పరిచయం ఉండగా, ఆ పరిచయం కొంతకాలంగా కొనసాగుతుంది. అయితే అప్పటికే తోకల సాయి కి వివాహం అయ్యింది. అయితే ఈ విషయాన్ని ధార శివానికి తెలియకుండా ఈ వ్యవహారాన్ని కొనసాగిస్తున్నాడని.ఈ క్రమంలో నే ధార శివాని గర్భవతి కావడంతో తనను వైద్య పరీక్షలు నిమిత్తం భద్రాచలంలో ని ఓ ప్రైవేట్ హాస్పటల్ కు తానే తీసుకెళ్లి చూపించేవాడని బాధ్యత మహిళా తన ఆవేదనను వ్యక్తం చేస్తుంది. తన భవిష్యత్తు ఏమిటని తనను వెంటనే వివాహం చేసుకోవాలని సాయిని నిలదీయగా, ఆ గర్భానికి తనకు ఎలాంటి సంబంధం లేదని తోకల సాయి చెప్పడంతో వివాదం ఒక్కసారిగా ముదిరింది. దీంతో తీవ్ర ఆవేదనకు గురైన శివాని తన కుటుంబ సభ్యులు బూర్గంపాడు ఎస్సీ కాలనీలోని సాయి ఇంటి వద్దకు వెళ్లి అతడిని నిలదీసిన క్రమంలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. స్థానికులు సమాచారం మేరకు వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొని ఇరువర్గాల వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు తోకల సాయి పై బుధవారం నాడు బూర్గంపాడు పోలీసులు కేసు నమోదు చేయడం జరిగింది.

# ఆదివాసీలను అణిచివేయాలని చూస్తే తిరుగుబాటు తప్పదు

- వట్టం ఉపేందర్ తుడుం దెబ్బ జాతీయ అధ్యక్షులు
- అంగన్వాడీ ల నోటిఫికేషన్ లో ఆదివాసీలకు అన్యాయం
- తుడుం దెబ్బ డిమాండ్.
- ఆదివాసీలు పోరాటానికి సిద్ధం అవ్వాలి

**ప్రజా వాయిస్ కొత్తగూడ**5 వ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఆదివాసీ లు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు చాట్టలు జీవో లు అమలు కావాలంటే నిరంతరం పోరాడాలి అని వట్టం ఉపేందర్ ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జాతీయ అధ్యక్షులు అన్నారు సమావేశన్ని ఉద్దేశించి వట్టం ఉపేందర్ మాట్లాడుతూ ఆదివాసీలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు చట్టాలు జీవోలని ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడంలో విఫలమయ్యారని మండిపడ్డారు ఇటీవల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన అంగనవాడి పోస్ట్ లలో షెడ్యూల్ ప్రాంతాలలో ఏజెన్సీ చట్టాలను పరిణంలోకి తీసుకోకుండా ఆదివాసులకు కాకుండా వలస వచ్చిన గిరిజనేతరులు ఎస్సీ ,బీసీ ,ఓబీసీ లకు ఎలా అవకాశాలు కల్పిస్తారని ప్రశ్నించారు.ఏజెన్సీ ప్రాంతంలో 1/70, పేసా చట్టం-1996 చట్టాలు పటిష్టంగా అమలులో ఉన్నా కూడా గిరిజనేతరులకు ఏ ప్రతిపాదికన అవకాశాలు కల్పిస్తారని వలస వచ్చిన గిరిజనేతరుల వలన స్థానిక ఆదివాసుల సంస్కృతి సంప్రదాయాలకు హక్కులు చట్టాలకు జీవో లకు విఘాతం కలుగుతుందని ప్రభుత్వానికి తెలిసినప్పట్టికి కూడా ఏజెన్సీ ప్రాంతంలో అంగన్వాడీ పోస్టులు జనాభా ప్రాతిపదికన తీయడాన్ని ఆదివాసి సమాజం జీర్ణించుకోలేకపోతుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన అంగన్వాడీ పోస్టులను రద్దుచేసి 5 వ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక ఆదివాసులకే అంగన్వాడి పోస్టులలో అవకాశాలు కల్పించాలని లేనియెడల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దశలవారి ఉద్యమాలు ఆదివాసులు చేయాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారుకార్యక్రమం లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ నాయకులు సువర్ణపాక వెంకటరత్నం, ఈసం నాగేశ్వర్ రావు, పూనెం సందీప్ కుమార్, ఈసం శ్యామ్ రావు,సువర్ణపాక బాబీ,ఆదివాసీ దొర పటేళ్ల సంఘం ఉమ్మడి కొత్తగూడ మండల అధ్యక్షులు బీరబోయిన సమ్మయ్య, ఆదివాసీ ఉద్యోగ సంఘ నాయకులు ముడిగ రాంచందర్, వాసం నర్సయ్య, ఈసం సమ్మయ్య, పెనక సాగర్, బుర్క క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు



# హాలియా మెయిన్ రోడ్డుపై రాఖీ స్టాళ్లకు నో

- ట్రాఫిక్ కు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు
- ఎస్ ఐ సాయి ప్రశాంత్

జా వాయిస్/నల్గొండ క్రైమ్: రాఖీ పండుగ సందర్భంగా హాలియా పట్టణంలోని ప్రధాన రహదారులపై రాఖీ స్టాళ్లు ఏర్పాటు చేయడానికి ఎలాంటి అనుమతి లేదని ఎస్ఐ బి. సాయి ప్రశాంత్ తెలిపారు. రహదారులను ఆక్రమించి స్టాళ్లు ఏర్పాటు చేయడం, వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించడం, ప్రజలకు ఇబ్బందులు కలిగించడం నిషేధమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజల భద్రత దృష్ట్యా వ్యాపారులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.






# పలిమెలలో ప్రభుత్వ ఆసుపత్రి కరువు

- అత్యవసర వైద్యం కోసం మహాదేవపూర్ కు పరుగులు

**ప్రజా వాయిస్ పలిమెల** కొత్త మండలంగా ఏర్పడిన పలిమెలలో ప్రభుత్వ ఆసుపత్రి లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి అనారోగ్యానికి కూడా ప్రైవేట్ వైద్యాన్ని ఆశ్రయించాల్సి వస్తోందని, రాత్రి వేళల్లో అత్యవసర వైద్యం కావాలంటే 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న మహాదేవపూర్ ఆసుపత్రికి పరుగులు తీయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమయానికి వైద్యం అందక దారి మధ్యలోనే ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లలేక గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పేరుకే కొత్త మండలమని, అవసరమైన మౌలిక వసతులు కల్పించలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి పలిమెల మండల కేంద్రంలో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని ఏర్పాటు చేసి, వైద్య సిబ్బందిని అందుబాటులోకి తీసుకు రావాలని కోరుతున్నారు.

# ఆర్జీ- ఏరియాలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య



ప్రజా వాయిస్ గోదావరిఖనిరామగుండం రీజియన్-2 (ఆర్జీ-2) ఏరియా పరిధిలోని సైలో బంకర్ వద్ద తీవ్ర విషాదం చోటుచేసుకుంది. లక్ష్మీనరసింహ సెక్యూరిటీ ఏజెన్సీలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న ఎం. రాజ్ కుమార్ నిన్న రాత్రి బలవన్మరణానికి పాల్పడ్డారు.సమాచారం అందుకున్న వెంటనే సింగరేణి సెక్యూరిటీ అధికారులు, సీఐతో పాటు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి, మృత దేహాన్ని పరిశీలించారు. రాజ్ కుమార్ మృతికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# యూరియా బుకింగ్.. రైతులకు తిప్పలు!

- సాంకేతిక సమస్యలతో మీసేవల వద్ద రైతుల నిరీక్షణ
- కీప్యాడ్ ఫోన్ కూడా వాడని నిరక్షరాస్య రైతులు ఈ బుకింగ్ ప్రక్రియ అర్థం కాక ఆందోళన



**ప్రజా వాయిస్ పలిమెల** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలో యూరియా కొనుగోలుకు ప్రభుత్వం తీసుకొచ్చిన ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ విధానం రైతులకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. గత రెండు రోజులుగా మీసేవ కేంద్రాల్లో సర్వర్ల సమస్యతో స్లాట్ బుకింగ్ సేవలు నిలిచిపోయాయి. బుకింగ్ సమయంలో రైతుల మొబైల్ ఫోన్లకు ఓటీపీలు రాకపోవడంతో గంటల తరబడి కాచిరాయాల్సి వస్తోంది. మరోవైపు పట్టాదారు పాస్‌బుక్‌కు మొబైల్ నంబర్ లింక్ కాక, దాన్ని సరిచేసుకునేందుకు రైతులు ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. మండలంలో కీప్యాడ్ ఫోన్ కూడా వాడని నిరక్షరాస్య రైతులు ఈ బుకింగ్ ప్రక్రియ అర్థం కాక ఇతరులపై ఆధారపడుతున్నారు. పొలాల్లో పనులు వదులుకుని మీసేవల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. సమయానికి ఎరువులు అందకపోతే పంట దిగుబడిపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సాంకేతిక లోపాలను సరిచేయాలని, గ్రామీణ రైతుల పరిస్థితులకు అనుగుణంగా బుకింగ్ విధానాన్ని సరళీకృతం చేసి, యూరియా సకాలంలో అందేలా చూడాలని మండల రైతులు కోరుతున్నారు.




# సాగర్ నీళ్ల కోసం.. బీఆర్ఎస్ మహాధర్నా

- ఎడమ కాలువకు వెంటనే నీరు విడుదల చేయాలి
- రైతుల ప్రయోజనాలను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం: బీఆర్ ఎస్ నేతలు

**ప్రజా వాయిస్, హుజూర్‌నగర్:** రైతుల తాగు, సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని సాగర్ ఎడమ కాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఇందిరా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అధ్యక్షత వహించారు. బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తాగునీటి అవసరాలు కూడా పెరుగుతున్న నేపథ్యంలో సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు.సాగర్ ఎడమ కాలువకు వెంటనే నీటిని విడుదల చేయకపోతే మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. మహాధర్నాలో నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# విధులు మరిచిన ఎక్స్ఛేంజి శాఖ!

- అదనపు రేట్లు అమ్మకాలలో జోక్యం ఎందుకు చేసుకోరు?
- బడి గుడి తేడా లేకుండా బెల్ట్ షాపులు నడపడం నేరం కాదా!
- అమాయక గిరిజన యువత చెడు పోతుంటే స్పందన కరువా!
- ఏసీ గదులకు అలవాటు పడి విధి నిర్వహణలో మరిచారా మీరు?
- కళ్ళ ముందు అక్రమాలు కనిపిస్తున్న స్పందన ఎందుకు ఉండదు తెలపండి సారు!?



**ప్రజా వాయిస్ అశ్వారావుపేట** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎక్సైజ్ శాఖకు కొన్ని మండలాలు అంటే అపరిమితమైన ప్రేమ ఎక్కువ కళ్ళకు కనిపించే విధంగా అక్రమాలు జరుగుతున్న పట్టించుకునే పరిస్థితి కనిపించదు. కారణం అమాయక గిరిజన యువత చెడిపోతుంటే ఆనందంగా ఆస్వాదించడమే తప్ప అదుపు చేస్తే మార్గదర్శకాలు ఉండవని మరోసారి రుజువు అవుతుంది. అదనపు రేట్లు తో అమ్మకాలు జరుపుతున్న మా పరిధి కాదు? అంటూ చూసి చూడనట్లుగా వ్యవహరించడం వారికే సాధ్యం! బడి గుడి అనే తేడా లేకుండా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ఎందుకు స్పందించరో తెలియదు. కానీ పాపం ఏసి గదులకు అలవాటు పడి విధి నిర్వహణలో సైతం మరిచిపోయి కళ్ళ ముందు అక్రమాలు కనిపిస్తున్న స్పందించే హృదయాలు సైతం కలిగిన అధికారులు లేరంటూ అయ్యా ఎక్సేంజ్ శాఖ మీకు ఇది తగునా అన్నట్లుగా ప్రజానీకం ప్రశ్నిస్తున్న రవ్వంతైన స్పందన కరువే! వారి ఇచ్చే ముడుపులకు బానిసై విధి నిర్వహణలో సైతం ఆదమరుస్తున్నారంటే వారి ప్రవర్తన ఎంత దొరణం గా ఉందో కళ్ళకు కట్టినట్లుగా ములకలపల్లి మరియు అన్నపరెడ్డిపల్లి పట్టణాలలో మద్యం విక్రయాలు కొనసాగింపును చూస్తే అర్థమవుతుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం లోని అన్నపురెడ్డిపల్లి,ములకలపల్లి. పట్టణాలకు ప్రభుత్వం మద్యం దుకాణాలను కేవలం ఐదు షాపులనే ప్రభుత్వం కేటాయించడం జరిగింది. వీటిని దక్కించుకున్న సిండికేటర్లు మాత్రం గ్రామాలలో ప్రతి 10 కుటుంబాలకు ఒక బెల్ట్ షాపులు నిర్వహించి తమ సొంత వాహనాల ద్వారా రవాణా జరిపించి భారీగా అధిక రేట్లతో విక్రయాలు జరిపి లక్షల రూపాయలను దండుకుంటున్నారు. ఇంత తతంగం జరుగుతున్న స్పందించాల్సిన సంబంధిత శాఖ మాత్రం స్పందన కరివే! అంటూ యువతి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజానికి గ్రామాలలో కల్తీ మద్యం గాని, నాటు సారా కానీ, కల్తీ కల్లు గాని క్రైమ్ విక్రయాలు జరిపితే వెంటనే ప్రత్యక్షమై వారిపై ఎక్స్ఛేంజి శాఖకు సంబంధించిన చట్టాలను అమలు చేసి కోర్టులో హాజరు పరిచే విధంగా చర్యలు చేపట్టడంలో దిట్ట. అని చెప్పుకోవచ్చు.! కానీ అధిక ధరలలో ప్రభుత్వం మద్యాన్ని విక్రయించకూడదని లైసెన్సులు పొందే సమయంలోనే ఓ ఒప్పందాన్ని పుచ్చుకున్న సిండికేటర్లు దందాకు పాల్పడితే ఎక్సైజ్ శాఖ ఎందుకు స్పందించటం లేదో తెలియని పరిస్థితి ఉందని మండలాల్లో ప్రజానీకం తీవ్రంగా అధికారుల తీరును విమర్శిస్తున్నారు.

## బడి గుడి అనే తేడా లేకుండా మద్యం విక్రయాలు

ములకలపల్లి పట్టణ సమీపంలో ఓ ప్రభుత్వ పాఠశాల సమీపంలో అతి దగ్గరగా బెల్ట్ షాపులు నిర్వహించి మద్యాన్ని విక్రయాలు జరిపిస్తున్నారు. సిండికేటర్లు! నిజానికి ఎంతో ఉన్నత స్థాయికి విద్యార్థి ఎదగాలంటే విద్య ఒక్కటే అని ప్రభుత్వాలు ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉపదేశాలు అందిస్తున్న ఇటువంటి బెల్ట్ షాపులు నిర్వహించే సందర్భంలో వారికి ఎందుకు కంటికి కనపడవు? వారి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేయటం లేదని కారణము? కావచ్చేమో! బడుగు బలహీన వర్గాలకు చెందిన అమాయక గిరిజన యువత మాత్రమే సర్కార్ దవాఖానాలో విద్యభ్యాసాలు కొనసాగిస్తారని యువత ఎటు పోతే మాకేంటి మా జీతభత్యాలు మాకు అందుతున్నాయి. అన్న ధీమ తోనే బడి గుడి అనే తేడా లేకుండా మద్యం సరఫరా చేస్తున్న పట్టించుకోవడం లేదంటూ మండలంలో భారీగా విమర్శలు లేకపోలేదు.

## ఏసీలకే పరిమితమైన ఉద్యోగులు!

బెల్ట్ షాపులు నిర్వహించి విక్రయాలు జరిపి అదనపు ధరలకు మద్యం సరఫరా చేస్తే కఠిన చర్యలు అని ప్రభుత్వ ముందుగానే సిండికేటర్లకు హెచ్చరికలు జారీ చేసిన వీరు మాత్రం వాటిని అమలు చేసే పరిస్థితి కనిపించదు. పేరుకు మాత్రం ఎక్స్ఛేంజి శాఖె అయినప్పటికీ ఉద్యోగస్తులు కేవలం ఏసీ గదులకు పరిమితమై తమ సొంత పనులు చేసుకుంటున్నారే తప్ప విధి నిర్వహణలో భాగంగా విధులు నిర్వహించే పరిస్థితి ఉండదని వారికి సకల సౌకర్యాలు సిండికేటర్లే ఏర్పాటు చేయడం వల్ల కేవలం ప్రభుత్వం వాహనాల నుండి కాలు నేలపై పెట్టే పరిస్థితి లేకుండా కేవలం రోజువారి కార్యక్రమాలు కాగితాలకే తప్ప విధినిర్మాణంలో జరిపే పరిస్థితి కనిపించదని మండలంలో భారీగా ప్రచారం కొనసాగుతుంది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి అన్నపరెడ్డి పల్లి ములకలపల్లి వంటి పట్టణాల్లో మద్యం సిండికేట్ల దందాను అరికట్టే విధంగా చర్యలు చేపట్టాలని బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి అదనపు రేట్ల తో వ్యాపారం కొనసాగిస్తున్న వ్యాపారస్తులపై ఎక్స్ఛేంజి యాక్ట్ అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని రెండు మండలాల యువకుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు



# బీసీలు సంఘటితమై రాజ్యాధికారం సాధించాలి

- ఓటుతోనే బీసీల హక్కుల కోసం పోరాడాలి: ఆర్ .కృష్ణయ్య
- బీపీ మండల్ జయంతి సందర్భంగా 17 రోజుల ఆమరణ నిరాహార దీక్ష యోధుడు చాపర్తి కుమార్ గాడ్గేకు సన్మానం

**హైదరాబాద్, ప్రజా వాయిస్:**బీసీలు సంఘటితమై రాజ్యాధికారం కోసం ఓటుతో పోరాటం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం, చట్టసభల్లో రిజర్వేషన్లు సాధించేందుకు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.బీపీ మండల్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని 2024 ఆగస్టు 25 నుంచి 17 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసిన ఉద్యమకారుడు చాపర్తి కుమార్ గాడ్గేను ఆర్.కృష్ణయ్య శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీల హక్కుల కోసం చాపర్తి కుమార్ గాడ్గే నిరంతరం ప్రజాక్షేత్రంలో పోరాడుతున్నారని కొనియాడారు. 17 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడంతో పాటు, గత మార్చిలో చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ సుమారు 450 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారని తెలిపారు.అలాగే 'రచ్చబండ కాడ రచ్చ చేద్దాం.. బీసీ రాజ్యాధికారం సాధిద్దాం' అనే నినాదంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 నియోజకవర్గాల పరిధిలో సైకిల్ యాత్ర నిర్వహించి బీసీల రాజకీయ హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించారని పేర్కొన్నారు.ఓటే బీసీల ఆయుధంబీసీలు తమ హక్కుల కోసం ఐక్యంగా నిలబడాలని, రాజకీయంగా బలోపేతం కావాలని ఆర్.కృష్ణయ్య సూచించారు. ఎన్నికల సమయంలో బీసీల ఓటు కీలకమని, తమకు న్యాయం చేసే వారినే గుర్తించి ఓటు ద్వారా రాజకీయంగా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంచార జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు నిమ్మల వీరన్న, బీసీ లీగల్ సెల్ అధ్యక్షుడు వంశీ, న్యాయవాది తదితరులు పాల్గొన్నారు.

# చిల్లరే.. లెక్కేస్తే రూ. లక్షలే!

- పెద్ద శంకరంపేటలో వంటగ్యాస్ దందా.. వినియోగదారుల జేబులకు చిల్లులు
- సిలిండర్ ధర ఒకటైతే.. అదనపు వసూళ్లు మరోలా
- పంపిణీలోనూ నిబంధనలు పక్కనపెడుతున్నారన్న ఆరోపణలు
- గ్యాస్ ఏజెన్సీల తీరుపై వినియోగదారుల అసంతృప్తి

**పెద్ద శంకరంపేట, ప్రజా వాయిస్:** వంటగ్యాస్ సిలిండర్ అంటేనే సామాన్యుడి ఇంటి నెలవారీ ఖర్చులో కీలక భాగం. పెరిగిన నిత్యావసరాల ధరలతో ఇప్పటికే సతమతమవుతున్న ప్రజలకు గ్యాస్ సిలిండర్ వ్యవహారంలో అదనపు భారం తప్పడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు సిలిండర్ అందాల్సి ఉండగా, పంపిణీ సమయంలో అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారంటూ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ధర ఒకటైతే.. వసూలు మరోలా?గ్యాస్ సిలిండర్ ధరకు తోడు రవాణా, డెలివరీ పేరుతో అదనపు మొత్తాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. అధికారిక ధర ఎంత? వినియోగదారుడి నుంచి వాస్తవంగా ఎంత వసూలు చేస్తున్నారు? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.పేదలపై అదనపు భారంవంటగ్యాస్ ధర పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలకు అదనపు వసూళ్లు మరింత భారంగా మారుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సిలిండర్ ఇంటి వద్దకు చేరే సమయానికి నిర్ణయించిన ధర కంటే ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తోందని పలువురు వినియోగదారులు వాపోతున్నారు.అధికారుల తనిఖీలు ఎక్కడ?గ్యాస్ పంపిణీ వ్యవస్థపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సి ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో తనిఖీలు కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వినియోగదారుల నుంచి అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.



# బతికించుకోవాలని ఆరాటం.. దక్కని ప్రాణం

- మానస విద్యా మందిర్ 'లెక్కల' మాస్టారుకు కన్నీటి వీడ్కోలు
- ఆస్పత్రి ఖర్చుల కోసం విద్యార్థులు, గ్రామస్తుల చందాలు
- గురువు కోసం ఒక్కటైన శిష్యులు.. నిలువెల్లా పరితపించిన వైనం
- బైక్ ర్యాలీగా వెళ్లి భౌతికకాయానికి అశ్రునయనాల స్వాగతం- శోక గీతాల మధ్య అంతిమయాత్ర
- చాడలో తీరని విషాదం



**ప్రజా వాయిస్,మోటకొండూరు:**ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి.. లెక్కలంటే భయాన్ని పోగొట్టిన ఆదర్శ ఉపాధ్యాయుడు నీరానెముల సంతోష్ ఇక లేరు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం చాడ గ్రామానికి చెందిన ఆయన మానస విద్యా మందిర్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న సంతోష్ మృతి చెందడంతో శిష్యులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు.

## బతికించుకునేందుకు శిష్యుల తపన

సంతోష్ తీవ్ర అనారోగ్యానికి గురయ్యారని తెలియగానే ఆయన శిష్యులు, గ్రామ యువత, స్థానికులు ఒక్కటయ్యారు. ఆస్పత్రి ఖర్చుల కోసం చందాలు వేసుకుని ఆర్థిక సాయం అందించారు. ఎలాగైనా తమ గురువును బతికించుకోవాలని ప్రార్థించారు. అయితే వారి ప్రయత్నాలు, ప్రార్థనలు ఫలించలేదు. చికిత్స పొందుతూ సంతోష్ సార్ తుదిశ్వాస విడిచారు.

## కన్నీటితో స్వగ్రామానికి..

ఆస్పత్రి నుంచి సంతోష్ భౌతికకాయాన్ని స్వగ్రామానికి తీసుకొస్తుండగా విద్యార్థులు, గ్రామ యువకులు బైక్ ర్యాలీగా వెళ్లి ఎదురేగారు. శోక గీతాల మధ్య భౌతికకాయానికి కన్నీటితో స్వాగతం పలికారు. 'మమ్మల్ని వదిలి వెళ్లి పోయావా సార్' అంటూ విద్యార్థులు బోరున విలపించడం చూపరులను కలచివేసింది. అనంతరం గ్రామస్తులు, విద్యార్థులు, బంధుమిత్రుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన మంచి గురువును కోల్పోయామని శిష్యులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

# పినపాక గడ్డపై రాజకీయ రచ్చ



### గత ప్రభుత్వంలో ఇసుక దోపిడీ జరిగింది సరే.. ప్రస్తుత ప్రభుత్వంలో జరిగేది ఏమిటి..!??

- వివాదాస్పదంగా స్థానిక ఎమ్మెల్యే వ్యాఖ్యలు
- ఇరువై మూడు సంవత్సరాల పాలనలో ప్రజలకు ఒరిగింది ఏముంది
- ఆస్తుల వివరాలు చూపించేందుకు సవాల్ విసిరిన రేగ
- రేగ వ్యక్తిగత జీవితం రాజకీయం చేసిన స్థానిక ఎమ్మెల్యే పాయం
- కాంగ్రెస్ పార్టీలో కామాంధులు లేరా అంటూ విశ్లేషకులు
- గత ప్రభుత్వంలో సహజ సంపద దోపిడీ ఎంత!? ప్రస్తుతం ప్రభుత్వంలో ఎంత!?
- దమ్ముంటే ప్రస్తుత ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్యే ప్రజావాయిస్ డెబిట్ కి సిద్ధంగా ఉండండి

**ప్రజా వాయిస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ రాజకీయం వివాదాలు నేడు వివాదాస్పదంగా మరినయా ప్రజలకు సేవలు అందించవలసిన ప్రజా ప్రతినిధులే, ఒకరి పైన మరొకరు వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేసుకోవడం ప్రభుత్వ భూములు. చెరువు శిఖం భూములు,పేదల పట్టా భూములు, ఫారెస్ట్ భూములు. అధికార అహంకారంతో అంతర్గతంగానే బెదిరించి స్వాధీనం చేసుకుంటూ. ప్రజాధనం దుర్వినియోగం చేస్తూ వేల కోట్ల రూపాయలు సంపాదించినట్లు నియోజకవర్గం లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసిన పాయం వెంకటేశ్వర్లు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రేగా కాంతారావు భూకబ్జాలు చేశాడని సెటిల్మెంట్ . ఇసుక క్వారీల ద్వారా కోట్ల రూపాయలు సంపాదించాడు అంటూ ఒకటికి పది సార్లు పాయం వెంకటేశ్వర్లు రాజకీయ అస్త్రంగా ప్రచారం చేయడం దాంతో ఫలితం దక్కకపోవడంతో. నేడు రేగ కాంతారావు వ్యక్తిగత జీవితమే టార్గెట్ చేస్తూ రాజకీయం చెయ్యడం, ఆరు గ్యారెంటీలు అమలు చెయ్యాలి అంటూ మాజీ ఎమ్మెల్యే ప్రశ్నిస్తే వాడు కామ కాంతారావు. కబ్జాల కాంతారావు, ఇసుక దోపిడీ కాంతారావు, గంజాయి స్మగ్లర్లకు సహాయం చేసిన కాంతారావు అంటూ స్థానిక పాయం వెంకటేశ్వర్లు మీడియా ముందు కౌంటర్ ఇవ్వడం నియోజకవర్గంలో వివాదస్పదంగా మారింది. దాంతో కాంగ్రెస్ పార్టీలో కామాంధులు లేరా! లేకుంటే స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వ్యక్తులు అనేకమంది మహిళల జీవితాలు ఆగం చేసినట్టు 130 సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగు దిన పత్రిక గత సంవత్సరం ఎందుకు ప్రచారం చేసింది!? అనే అనుమానాలు వ్యక్తం అవుతుంది .తమ పార్టీ నేతలు తమ కార్యకర్తలు వివాహేతర సంబంధాలు పెట్టుకున్న. మహిళలను వ్యభిచారులుగా ప్రచారం చేసిన. కాంగ్రెస్ నేతలకు భారత దేశంలో గల రాజ్యాంగబద్ధమైన గౌరవ చట్టాలు ఉపయోగిస్తూ కాపాడుకునే కాంగ్రెస్ నేతలు. నేడు ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ నేత జిల్లాస్థాయి వ్యక్తిపై వ్యక్తిగత జీవితం ప్రస్తావిస్తూ రాజకీయ జీవితానికి భంగం కలిగించే ప్రచారం చెయ్యడం ఏమిటి అంటూ పలువురు నేతలు మేధావుల అయోమయంలో పడ్డారు. వ్యక్తిగత జీవితం వివాదాస్పదంగా మార్చడం ఏమిటి అంటూ మేధావులు సూటిగా ప్రశ్నిస్తున్నారు.కాంగ్రెస్ పార్టీలో ఉన్న వ్యక్తులు వివాహేతర, సంబంధాలు పెట్టుకోవడం పచ్చని కాపురాలు కూల్చి వెయ్యడం జరిగిన నోరు విప్పని స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు!..అదే ప్రతిపక్ష పార్టీలో ఉన్న వ్యక్తులు వివాహేతర సంబంధాలు పెట్టుకుంటే వేబిచారమా,!? అనేది ప్రజా ప్రతినిధి ఆత్మ పరిశీలన చేసుకోవాలి అంటూ ప్రతిపక్ష పార్టీల నేతలు గుసగుసలాడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే రేగ కాంతారావు సూటిగా చేసిన సవాల్ (1) ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి. నీ ఆస్తులు ఎంత నా ఆస్తులు ఎంత అంబేద్కర్ సెంటర్లోనే చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరితే అధికారంలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే వ్యక్తిగత జీవితంపై వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రజలు అయోమయంలో పడ్డారు. ప్రస్తుత ఎమ్మెల్యేకు భూములు లేకపోతే అశ్వాపురం మండల పరిధిలో గల తుమ్మలచెరువు ప్రాంతంలో దాదాపు 50 ఎకరాల భూమి గుంజుకున్నట్లు ఎందుకు గుసగుసలు వినిపిస్తున్నాయంటూ బిఆర్ఎస్ నేతలు బహిరంగ చర్చలు చేయడం నేడు రాజకీయం మరింత వాడి వేడిగా మారబోతుంది. అదేవిధంగా గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఇసుక క్వారీల అక్రమాలపై స్పందించే ప్రభుత్వ అధికారులు కాంగ్రెస్ పాలనలో గోదావరి నదిలో సర్వం దోపిడీ చేసిన కలెక్టర్ స్థాయి వ్యక్తులు కూడా స్పందించకపోవడం ఏమిటి అంటూ మేధావి వర్గం మండిపడుతుంది. దమ్ముంటే ఇద్దరు సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ కు చూపించిన రేగ కాంతారావు ఆస్తుల వివరాలు ఏమిటి!? ఎన్నికల కమిషన్ కు చూపించిన స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్ల ప్రస్తుత ఆస్తుల వివరాలు ఏమిటి!? అంబేద్కర్ సెంటర్లో నిజంగానే చర్చ జరిగితే నియోజకవర్గం అభివృద్ధి జరిగే



అవకాశాలైన ఉంటాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

### కాంగ్రెస్ పార్టీలో కామాంధులు లేరా...!?

మణుగూరు మండలంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలోనే అనేకమంది మహిళల జీవితం దారి తప్పింది అనేది జగమెరిగిన సత్యమే. యూత్ కాంగ్రెస్ కార్యకర్తను అంటూ సోషల్ మీడియా వేదికగా ప్రచారం వ్యక్తి పచ్చని కాపురాలు కూల్చి వేసిన ఘటన మణుగూరు మండలంలోనే లేదా!? ప్రధాన అనుచరుడైన ఒక వ్యక్తి గత సంవత్సరం పార్టీ ప్రచారాలకు అని పిలిచి మహిళలను మోసం చేసినట్లు 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పత్రిక వారస కథనాలు రాసింది నిజం కాదా!? ఆరోజు బిఆర్ఎస్ నేతలు వ్యక్తిగత జీవితం పై నోరు విప్పకుండా మౌనంగా ఉన్నందుకే. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నేతలు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల ఆదరణ పొందిన కాంతారావుకు కామ కాంతారావు పేరు పెట్టడం ఏమిటి!? ఏది ఏమైనా వ్యక్తిగత జీవితం రాజకీయం చేయకుండా. ఆత్మ పరిశీలన చేసుకుని ఈ ప్రాంత అభివృద్ధికి ఇద్దరు వ్యక్తులు సహకరిస్తే ప్రజలకు మంచి జరిగే అవకాశాలు ఉన్నాయని విద్యావంతులైన మేధావులు ప్రత్యేకంగా కోరుకుంటున్నారు..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన పినపాక నియోజకవర్గ పరిధిలో గల గోదావరి నది తీరాన గత బిఆర్ఎస్ ప్రభుత్వం గిరిజన సొసైటీ పేరుతో అనుమతులు ఇచ్చిన. గోదావరి నదిలో ఏదైనా తప్పు జరిగినట్లు సమాచారం రాగానే తాసిల్దార్ స్థాయి నుండి జిల్లా కలెక్టర్ వరకు అప్రమత్తంగా ఉండేవారు. పరిమితికి మించి తవ్వకాలు జరిగితే దోపిడీదారులకు వణుకు పుట్టే విధంగా ప్రభుత్వ అధికారులు ఉగ్రరూపం చూపించేవారు దాంతో ఇసుక క్వారీల కాంట్రాక్టర్లు తప్పు చేయాలి అంటే భయపడే పరిస్థితి ఉండేది. మరి కాంగ్రెస్ పాలనలో ఇంత అరాచకం ఎందుకు!? బి టి పి ఎస్ పంప్ హౌస్ బావుల పక్కన భూగర్భ జలాలు అడుగంటి పోయే విధంగా తవ్వకాలు జరిపితే. జెన్కో అధికారులకు 10 కిలోమీటర్ల గోదావర అగ్రిమెంట్ చేసిన కలెక్టర్ ఎందుకు మౌనం పాటించారు!? పూడిక తీతల పేరుతో గోదావరి నది గర్భం చీల్చింది కాంగ్రెస్ పార్టీ ఖాతాలో లేదా లేదా!? ఇసుక క్వారీ పేరుతో ఫారెస్ట్ అడవులు ధ్వంసం చేసి రహదారులు ఏర్పాటు చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీ ఖాతాలో లేదా!? ఒకప్పుడు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ముగిసే ఇసుక లోడింగ్ నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో24/7 అందుబాటులోకి తెచ్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి లేదా!?? చీకటి ముసుగులో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే కాంట్రాక్టర్లు పట్టుబడిన చరిత్ర కాంగ్రెస్ పార్టీలోనే ఉంది అనేది నిజం కాదా!? ఇప్పటికైనా రేగ కాంతారావు ఇసుక దోపిడీ చేశారు. ప్రభుత్వ భూములు కబ్జా చేశారు ఫారెస్ట్ భూములు కబ్జా చేశారు అనే ప్రచారం వదిలేసి.. వీలైతే ప్రజలకు సేవలు అందించి.. ఈ ప్రాంత అభివృద్ధి పనులకు కట్టుబడి పని చేయాలని ప్రతిపక్ష పార్టీలు కోరుకుంటున్నాయి



## డీసీసీ పీఠం.. భీమ్ భరత్ పేరే 'హాట్ టాపిక్'..!

- సంఘటన్ సృజన్ అభియాన్ లో భాగంగా క్షేత్రస్థాయి అభిప్రాయ సేకరణ
- నాయకులు, కార్యకర్తలతో నేరుగా మాట్లాడిన ఏఐసీసీ అబ్జర్వర్ పీవీ మోహన్
- మొయినాబాద్ సమావేశంతో డీసీసీ ఎంపికపై పెరిగిన ఆసక్తి

**మొయినాబాద్ (ప్రజావాయిస్ ):** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కొత్త అధ్యక్షుడి ఎంపికపై కాంగ్రెస్‌లో జోరుగా కసరత్తు సాగుతోంది. ఏఐసీసీ సూచనల మేరకు సంఘటన్ సృజన్ అభియాన్లో భాగంగా బుధవారం మొయినాబాద్‌లో నిర్వహించిన చేవెళ్ల నియోజకవర్గ స్థాయి సమావేశంలో నాయకులు, కార్యకర్తల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించారు.జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పామేన భీమ్ భరత్ నేతృత్వంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అబ్జర్వర్, కర్ణాటక ఎమ్మెల్సీ పీవీ మోహన్ నాయకులు, కార్యకర్తలతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.డీసీసీ అధ్యక్షుడిగా పార్టీ కోసం కష్టపడే వ్యక్తి, కార్యకర్తలకు అందుబాటులో ఉండే నాయకుడు, అందరినీ కలుపుకుని పోయే వ్యక్తి కావాలని పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ క్రమంలో డీసీసీ పగ్గాలు భీమ్ భరత్‌కు అప్పగించాలనే మాటలు సమావేశంలో బలంగా వినిపించినట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.పార్టీని బూత్ స్థాయి నుంచి గట్టిగా నిలబెట్టడమే సంఘటన్ సృజన్ అభియాన్ లక్ష్యమని పీవీ మోహన్ తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తల మాటకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.మొయినాబాద్ వేదికగా జరిగిన ఈ సమావేశంతో డీసీసీ పీఠం ఎవరికి దక్కుతుందన్న దానిపై కాంగ్రెస్ శ్రేణుల్లో ఆసక్తి మరింత పెరిగింది. డీసీసీ అధ్యక్ష పదవికి పోటీలో ఉన్న ఆశావహులు సైతం సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## కొలిక్కిరాని సంగారెడ్డి డి సి సి అధ్యక్ష పదవి

- పోటీలో నేనంటే.. నేనే
- మంత్రి దామోదర్ మాత్రం ఉజ్వల్ రెడ్డికి ప్రతిపాదన
- ఎంపీ సురేష్ షెట్కర్ తన సోదరుడికి ప్రయత్నం
- తెరపైకి నీలం మధు పేరు
- ఎవరిని వరిస్తుందో చూడాలి









**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పీఠం కోసం తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకోసం తన వర్గానికి సంబంధించిన వ్యక్తులకే పదవులు ఇప్పించాలన్న పట్టుదలతో మంత్రి ఉండగా తమకున్న రాజకీయ పలుకుబడితో రాష్ట్ర నేతలతో తమ అనుచరులకు ఇప్పించుకోవాలంటూ మరికొందరు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే దాదాపుగా జిల్లా అధ్యక్షులుగా కాట శ్రీనాథ్ గౌడ్ లేదా అతని సతీమణి పేరు ఖారారు అయినట్లు తెలిసింది. కానీ తాను ఇప్పటికే ఎమ్మెల్యేగా నిలబడి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నందున డిసిసి అధ్యక్షు రెసులో తానులేను అంటూ ప్రకటించారు. తన రాజకీయ గురువు అయిన దామోదర్ రాజనర్సింహ సైతం కాట శ్రీనివాస్ గౌడ్ కుటుంబంలో ఎవరిని ఒకరిని జిల్లా అధ్యక్ష పదవికి ఎంపిక చేయాలని ఆలోచన చేశాడు. చివరి వరకు ప్రయత్నించిన వారు డీసీసీ అధ్యక్ష పదవి తీసుకునేందుకు సుముకం వ్యక్తం చేయకపోడంతో గతంలో జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఉజ్వల్ రెడ్డిని జిల్లా అధ్యక్ష పదవి ఇప్పించాలని ప్రయత్నిస్తున్నారు. ఇదే తరుణంలో ఎంపీ సురేష్ షెట్కర్ సైతం తన సోదరుడు నగేష్ శెట్కార్ కు ఇప్పించేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు . ఆయన మాత్రం ఇప్పటికే పార్టీ సేవా కార్యక్రమాలతో పాటు తన సంస్థ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. దానికి తోడు తాను గతంలో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయినందున ( పార్టీ మారిన అపోహ) ఉన్నందున డిసిసి అధ్యక్షులు ఎన్నికకు దూరంగా ఉండాలని అంతర్గత తన అనుచరులతో చెప్పినట్లు తెలుస్తుంది. దీనికి తోడు జోగిపేటపట్టణం చెందిన ముదిరాజ్ సంఘం నాయకుడు , మాజీ కౌన్సిలర్, తన రా తండ్రి రాజకీయ జీవితాంతం కాంగ్రెస్ పార్టీలోనే ఉందని... అందుకు తనకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి ఇప్పించేందుకు సహకరించాలంటూ జిల్లా ఇన్చార్జ్ నీ వ్యక్తిగతంగా కలిసి తన రాజకీయానికి సంబంధించిన పూర్తి బయోడేటాను అందజేశారు. ఇదన్నటికి పక్కన పెడితే పార్లమెంట్ కాంటెస్ట్ అభ్యర్థిగా పోటీ చేసిన నీలం మధును డిసిసి అధ్యక్షుడిగా ఎన్నిక చేస్తే రాజకీయ విమర్శలకు దూరంగా ఉండే వ్యక్తి, గ్రూప్ లు అంటే నచ్చని వ్యక్తి నీలం మధు. అలాంటి వ్యక్తిని ఎంపిక చేస్తే పార్టీకి గాని నాయకుల్లో కూడా అసభ్య ఉండదని అభిప్రాయం కూడా వ్యక్తం అవుతుంది. దీంతోపాటు ఎప్పటిలాగే డిసిసి అధ్యక్షురాలుగా నిర్మల జయప్రకాష్ రెడ్డిని కొనసాగించాలంటే ఇప్పటికే రెండు పర్యాయాలు పదవి చేపట్టింది. దాంతోపాటు గత ఏడాది నా కాలంగా రాష్ట్ర స్థాయిని నామినేట్ పదవిలో ఉంది. అందువల్ల ఆమెకు డిసిసి అధ్యక్ష పదవి ఇచ్చే అవకాశం అయితే కనిపించడం లేదు. రాజకీయ విభేదాలకు విమర్శలకు దూరంగా ఉండే నీళ్ల మధును జిల్లా అధ్యక్ష పదవి ఇస్తే ప్రత్యర్థి పార్టీల నుంచి గట్టిగా ఎదుర్కొనే సత్తా ఒక్కడికే ఉందనే నమ్మకం అధిష్టానం లో ఉందని తెలుస్తుంది. ఏమైనాప్పటికీ జిల్లా నాయకుల్లో నెలకొన్న సయోధ్య లేని కారణంగా అదృష్టానికి జిల్లా అధ్యక్ష పదవి ఎంపిక పెద్ద తలనొప్పిగా మారింది. ఎవరు అధ్యక్షులు అవుతారో ఎదురు చూడవలసిన అవసరం ఉంది.



## గల్లీలో గళం.. ఢిల్లీలో నిర్ణయం!

- కనకమామిడిలో దళిత కుటుంబాలతో ఏఐసీసీ సెక్రటరీ అబ్సర్వర్ పీవి మోహన్ ముఖాముఖి
- సమస్యలపై ఆరా
- ఆత్మీయ రాఖీ కట్టి.. సమస్యలు పరిష్కరించాలని కోరిన దళిత మహిళలు
- మీ గళాన్ని ఢిల్లీ వరకు తీసుకెళ్తా: పీవీ మోహన్ భరోసా
- రంగారెడ్డి డీసీసీ పదవి భీమ్ భరత్ కే ఇవ్వాలని దళితులు ఏకగళంతో వేడుకోలు

**మొయినాబాద్ (ప్రజావాయిస్ ):**ప్రజల కష్టసుఖాలు తెలుసుకునేందుకు కాంగ్రెస్ నేతలు బుధవారం కనకమామిడి దళితవాడకు వెళ్లారు. ఏఐసీసీ సెక్రటరీ, అబ్జర్వర్ పీవీ మోహన్, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. రాఘమయి, పీసీసీ సెక్రటరీ శ్రీనివాస్, చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి పామెన భీమ్‌భరత్ తో కలిసి దళిత కుటుంబాలతో కూర్చొని వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు.రాఖీ పండుగ సందర్భంగా దళిత మహిళలు పీవీ మోహన్‌కు ఆప్యాయంగా రాఖీ కట్టి, తమ కష్టాలు కూడా సోదరుడిలా పట్టించుకుని పరిష్కరించాలని కోరారు. మహిళల ఆప్యాయతకు స్పందించిన పీవీ మోహన్.. అమ్మా.. మీ సమస్యలు చెప్పండి.. మీ గొంతును ఢిల్లీ దాకా తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తా అంటూ భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా దళితవాడ ప్రజలు రంగారెడ్డి డీసీసీ పగ్గాలు పామెన భీమ్‌భరత్‌కే ఇవ్వాలని ముక్తకంఠంతో కోరారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తమకు సాగు భూములు ఇచ్చి తదితర మేలులతో అండగా నిలిచిందని గుర్తుచేస్తూ, ఇప్పుడు వాడలో ఉన్న సమస్యలను కూడా తీర్చాలని విజ్ఞప్తి చేశారు.రాఖీ కట్టిన చేతుల్లో ఆప్యాయత.. సమస్యలు చెప్పిన మాటల్లో ఆశ.. భీమ్‌భరత్‌కు మద్దతులో ఏకతాటిపై దళితవాడ కనిపించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్,మండలాధ్యక్షుడు బోలిగిద్ద సత్యనారాయణ,మాజీ అధ్యక్షుడు మాణయ్య,మండల ఉపాధ్యక్షుడు మర్రి రవీందర్ రెడ్డి, గ్రామ ఇందిరమ్మ కమిటీ మెంబర్ రాములు, ఏఎంసీ డైరెక్టర్ బాలకృష్ణ రెడ్డి, రఘురామ్ రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు, గ్రామస్తులు హరిందర్, రాజు, గణేష్ తదితరులున్నారు




## అన్ని ఆయనే...?


- అప్పనంగా ఉద్యోగాన్ని సంపాదించి?
- అధికారులు.సిబ్బందిపై పెత్తనం
- ప్రతి పనికో రేటు.. సంపన్నుల జాబితాలో చేరినట్లు సమాచారం
- ఉన్నతాధికారులను మేనేజ్ చేయడంలో ఆయన దిట్ట?

**ప్రజా వాయిస్ హన్మకొండ** /పరకాల ప్రభుత్వ దావఖానలో ఆయన ఓ ఉద్యోగి అప్పనంగా ఉద్యోగాన్ని అప్పటి ఉన్నతాధికారుల అండదండలతో ఉద్యోగాన్ని సంపాదించి నేడు ఆ కార్యాలయ ఉన్నతాధికారుల సిబ్బందికి పెత్తందారుడయ్యాడు. ఉన్నతాధికారులకు ఎవరికి ఏం కావాలో వారిని ఎలా మేనేజ్ చేయాలో ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. దేవుడు వరమిచ్చిన పూజారి కనుకరించలే అన్న చందంగా అప్పనంగా ఉద్యోగం సంపాదించిన ఆ ఉద్యోగి రావాలనిపించినప్పుడే కార్యాలయానికి వస్తాడు. ఎవరన్నా ప్రశ్నిస్తే వారికి మనుగడ ఉండదు వివిధ హోదాల్లో పనిచేసి పదవి విరమణ పొందిన ఉన్నతాధికారుల అండ చూసుకొని ప్రభుత్వ దావఖనను శాసిస్తున్నాడు. ప్రతి పనికో రేటు పైసలు ఇయ్యందే పనులు చేయడు అనాది కాలంలోనే సంపన్న జాబితాలో ఆ ఉద్యోగి చేరినట్లు పట్టణవాసులు కార్యాలయ సిబ్బంది బహిర్గతంగా ఒకరితో ఒకరు ముచ్చడించుకోవడం చర్చనీయాంశంగా మారింది. అవినీతి రహిత సమాజ స్థాపన కోసం అహర్నిశలు పనిచేస్తున్న ప్రభుత్వం . స్థానిక శాసనసభ్యులు. జిల్లా కలెక్టర్ అవినీతి నిరోధక శాఖ అధికారులు. ప్రభుత్వ దవాఖాన పై దృష్టి పెడితే మరెన్నో అక్రమాలు బట్టబయలైతాయని పరకాల పట్టణవాసులు ప్రభుత్వ దావఖన సిబ్బంది వేడుకుంటున్నారు.

## నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద ఉద్రిక్తత

- నీటి విడుదలపై వివాదం కృష్ణ జలాలతో మళ్లీ మంటలు
- కేఆర్ ఎంబీ అనుమతులు లేకుండా ఏపీ ఏకపక్షంగా నీటి విడుదల
- పోటీగా ఎడమ కాలువకు నీరు వదిలిన తెలంగాణ అధికారులు
- తాగునీటి కష్టాల వేళ కాలువ పరివాహక ప్రాంతాల్లో భయాందోళనలు

**ప్రజా వాయిస్/ నల్గొండ క్రైమ్:** నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ కృష్ణా జలాల వినియోగంపై మరోసారి ఇరు తెలుగు రాష్ట్రాల మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డు (KRMB) ఆదేశాలను పక్కనపెట్టి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నీటి పారుదల అధికారులు. నాగార్జునసాగర్ నుంచి తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేసుకున్నట్లు చర్చ జరుగుతోంది. ఇవాళ ఉదయమే నాగార్జునసాగర్ కుడి కాలువ వైపు పవర్ జనరేషన్ ద్వారా తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేశారు ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అధికారులు.ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ నీటిపారుదల అధికారులు సైతం తాగునీటి అవసరాల దృష్ట్యా ఎడమ కాలువలో నీటిని విడుదల చేశారు. అయితే, తాగునీటి అవసరాల కోసమే నీటి విడుదల చేపట్టడంతో ఎలాంటి వివాదాలు, ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద పరిస్థితిని పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం తాగునీటి అవసరాల కోసం ఇరు రాష్ట్రాలు నీటిని వినియోగించుకోవడం మరోసారి కృష్ణా జలాల అంశాన్ని చర్చనీయాంశంగా మార్చింది.



# లక్ష్యంతో అడుగులు వేయాలి

**సనా ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా ఓరియంటేషన్**

**నైపుణ్యాలతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలి: కళాశాల యాజమాన్యం**





ప్రజా వాయిస్, కోదాడ:
సూర్యాపేట జిల్లా కోదాడలోని సనా ఇంజినీరింగ్ కళాశాలలో నూతన విద్యార్థుల కోసం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ నజీరుద్దీన్ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యను భవిష్యత్తును తీర్చిదిద్దుకునే గొప్ప అవకాశంగా విద్యార్థులు భావించాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ నాగప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. కమ్యూనికేషన్, టెక్నికల్ నైపుణ్యాలతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించుకోవాలని డైరెక్టర్ నౌమన్ అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలే విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమని పేర్కొన్నారు.డైరెక్టర్ కృష్ణారావు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించే దిశగా కష్టపడి పనిచేయాలని సూచించారు. నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పించేందుకు కళాశాల ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.కాగా, ఓరియంటేషన్ కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నూతన, సీనియర్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో కళాశాల ప్రాంగణంలో సందడి నెలకొంది. అనంతరం కళాశాలలోని విద్యా విధానం, విభాగాలు, ప్రయోగశాలలు, లైబ్రరీ, సాంకేతిక కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి, ప్లేస్‌మెంట్ అవకాశాలపై అధ్యాపకులు నూతన విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు

# భిన్నత్వం ఏకత్వానికి ప్రతీక మిలాద్ నబీ..

**ఘనంగా ఈద్ మిలాద్-ఉన్-నబీ ర్యాలీ..**



ప్రజా వాయిస్ జహీరాబాద్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో ఈద్ మిలాద్–ఉన్–నబీ సందర్భంగా పట్టణంలో బుధవారం మిలాద్–ఉన్–నబీ ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో ఈద్గా మైదానం నుండి జాతీయ రహదారి గుండా ముస్లీం సోదరులు ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొని జహీరాబాద్ నియోజకవర్గం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలచి అదేవిధంగా అన్ని మతాలు, వర్గాల ప్రజలు పరస్పర గౌరవం, సహనం, సోదరభావంతో కలిసి మెలిసి జీవించాలని ఆకాంక్షించారు. శాంతి, ఐక్యత, మానవత్వం, సమానత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈద్ మిలాద్–ఉన్–నబీ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్క ముస్లిం సోదరులకు, యువతకు ఈద్గా కమిటీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# రెండో రోజుకు చేరిన విన్నపాలు..

**ఈ ప్రాంత అభివృద్దే మా ప్రధాన ఏజెండా..!!**
**కరువు కోరల నుంచి కాపాడండి..**
**ఇల్లందు, బయ్యారం ముఖ్య నాయకుల విజ్ఞప్తి..**
**సానుకూలంగా స్పందించిన మంత్రులు..**
**50 వేల ఎకరాలను సస్యశ్యామలం చేస్తాం..**





ప్రజా వాయిస్,బయ్యారం..
బయ్యారం చెరువుకు గోదావరి జలాల తరలించుటకై మండల కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు ప్రభుత్వంలోని మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి ఎలినినో ప్రభావంతో మునుపెన్నడూ చూడని కరువుతో ఉన్న పరిస్థితులలో రైతులను ఆదుకోవాలని దృఢ సంకల్పంతో,చెరువుళనేటి వరకు నిండా కాకుండా కరువు పరిస్థితులు నెలకొన్నాయని ,దీనికి తక్షణమే సీతారామ ప్రాజెక్టు నుండి గోదావరి జలాలను ఇల్లందు ప్రాంతం మసివాగు ద్వారా గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశం ఉన్నదని, దానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క కలిసి బయ్యారం మండల రైతుల బాధలను అభివృద్ధి సంక్షేమ పై కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇల్లెందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య , మండల అధ్యక్షుడు, జిల్లా కార్యదర్శి ముఖ్య నేతలు,మండల గ్రామ పంచాయతీ కాంగ్రెస్ పార్టీ సర్పంచులు మంత్రులు మండల పరిస్థితులను వారికి వివరించారు. దీనికి ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా సీతారామ ప్రాజెక్టు డిజైన్ మార్చి డిపిఆర్ తయారుచేసి బయ్యారం చెరువుకు గోదావరి జలాలను అందించి నియోజకవర్గంలోని పలు మండలాల్లో సుమారుగా లక్షా 50 వేల ఎకరాలను సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మూడు రోజులుగా హైదరాబాదులోనే ఎమ్మెల్యే కోరం కనుకయ్య ,పలువురు క్యాబినెట్ మంత్రులను మహబూబాద్ నియోజకవర్గ ఎంపీ బలరాం నాయక్ రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి సహకారంతో కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ ఇరిగేషన్ ఆర్థిక శాఖ రెవెన్యూ శాఖ పంచాయతీల శాఖ మంత్రులను కలిసి తమ విన్నపాలను అందించారు. సానుకూలంగా స్పందించిన క్యాబినెట్ మంత్రులు నియోజకవర్గ పాటుపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలకంటి సీతారాం రెడ్డి, మరియు బయ్యారం మండలం గ్రామపంచాయతీ సర్పంచులు డైరెక్టర్లు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు..



# నేడు ఏడుపాయల క్షేత్రంలో అమ్మవారి పల్లకి సేవ....

**ఏడుపాయల కార్యనిర్వాహణ అధికారి వీరేశం వెల్లడి....**


ప్రజా వాయిస్, పాపన్నపేట
మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గా భవాని మాత ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా సాయంత్రం 6 గంటలకు పల్లకి సేవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి వీరేశం తెలిపారు. అమ్మవారిని పల్లకిలో ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో ఊరేగించనున్నారు. పల్లకి సేవా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అత్యాద్మిక వేడుకలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏడుపాయల సిబ్బంది మరియు ఆలయ అర్చకులు పాల్గొన్నారు

# వెల్స్పన్ కంపెనీ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

**ఎదురెదురుగా బైక్‌లు ఢీ**

**చికిత్స పొందుతూ 22 ఏళ్ల చర్ల శివకుమార్ యువకుడు మృతి**





(ప్రజా వాయిస్ షాబాద్)
షాబాద్ మండల పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు.మాచనపల్లి గ్రామానికి చెందిన చర్ల శివకుమార్ అదే గ్రామానికే చెందిన కుల సురేష్ తో కలిసి స్ప్లెండర్ ద్విచక్ర వాహనంపై మాచనపల్లి నుండి హైతాబాద్ వైపు బయలుదేరారు అర్ధరాత్రి సుమారు 11:00 గంటల సమయంలో వీరు వెల్స్పన్ కంపెనీ సమీపానికి చేరుకోగానే, ఎదురుగా హైతాబాద్ వైపు నుండి మాచనపల్లి వైపు వస్తున్న ప్యాషన్ ప్లస్ ద్విచక్ర వాహనం వీరి బైక్‌ను వేగంగా వచ్చి ముఖాముఖి ఢీకొట్టింది ఈ తీవ్ర ప్రమాదంలో ఇరు బైక్‌లపై ఉన్న వ్యక్తులు రోడ్డుపై బలంగా పడిపోయారు. ఘటనలో శివకుమార్ తలకు తీవ్ర రక్తగాయం కాగా సురేష్‌కి స్వల్ప గాయాలయ్యాయి. ఎదురుగా వచ్చి ఢీకొట్టిన ప్యాషన్ ప్లస్ బైక్ నడుపుతున్న వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. తీవ్ర రక్తగాయంతో కొట్టుమిట్టాడుతున్న శివకుమార్‌ను వెంటనే షాద్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శివకుమార్ మృతి చెందాడు. 22 ఏళ్ల వయస్సులోనే యువకుడు మృతి చెందడంతో మాచనపల్లి గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ ప్రమాదంపై షాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# మదర్ థేరీసా సేవలు ఆదర్శనీయం...

**వృద్ధులకు ఆసరాగా నిలిచి..చేతి కర్రల పంపిణీ..**

**ముస్లిం మైనార్టీ నాయకుడు ఎండి రహీం షరీఫ్**

ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం
యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో మదర్ థేరీసా జన్మదినం సందర్భంగా మునుగోడు నియోజకవర్గ ముస్లిం మైనార్టీ నాయకుడు ఎం.డి రహీమ్ షరీఫ్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక వృద్ధులకు చేతి కర్రలను పంపిణీ చేసి, శాలువాలతో సత్కరించారు.?అనంతరం రహీమ్ షరీఫ్ మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా సమాజసేవ చేసిన మదర్ థేరీసా మార్గం అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. అభాగ్యులను, వృద్ధులను ఆదుకోవడమే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి,ఆమె చూపిన సేవా మార్గంలో ప్రతి ఒక్కరూ పయాణించాలని అన్నారు. సమాజంలో ఆదరణ కరువైన వృద్ధులు అభాగ్యులకు తమవంతు సహాయం అందించడం బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నానని తెలిపారు.ఈ కార్యక్రమంలో వృద్ధులు, స్థానికులు పాల్గొన్నారు.




# నిరుపేద యువతికి పెళ్లి కానుక

**- దాతల ఉదారతతో రూ. 55 వేల సాయం**

**- మానవత్వం చాటుకున్న ఆలయ ఫౌండేషన్**



ప్రజా వాయిస్ రామగుండం
స్థానిక రామగుండం ఏరియాకు చెందిన నిరుపేద సోదరి దివ్య వివాహం బుధవారం అత్యంత కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఫౌండేషన్ నిర్వాహకులు ఐత శివ కుమార్ ఆధ్వర్యంలో సమకూర్చిన విశేష ఆర్థిక సాయాన్ని పెళ్లి రోజే వధువు దివ్యకు అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు.వివాహానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దివ్య కుటుంబ పరిస్థితిని వివరిస్తూ ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఐత శివ కుమార్ సోషల్ మీడియా ద్వారా దాతలను అభ్యర్థించారు. ఈ పిలుపుకు దాతల నుండి అపారమైన స్పందన లభించింది. దాతల ఉదారతతో సమకూరిన రూ. 46,000 నగదుతో పాటు రూ. 10,000 విలువైన నూతన పాత్రలు, పెళ్లి పూజ సామాన్లు, పెళ్లి చీరలు మరియు గృహోపకరణాలను పెళ్లి రోజే వధువుకు అందజేశారు. దీనికి తోడు వివాహం సందర్భంగా సాయిబాబా టెంపుల్ తరపున 300 మందికి భోజనాలు కూడా ఏర్పాటు చేయడం విశేషం. ఈ సందర్భంగా ఐత శివ కుమార్ మాట్లాడుతూ, గోలివాడ చంద్రకళ నేతృత్వంలో స్వచ్ఛంద సంస్థల మిత్రులంతా సమావేశమై ఈ పెళ్లికి కావలసిన ప్రతి ఒక్క వస్తువును సమకూర్చడంలో ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆపదలో ఉన్నారని తెలిసిన వెంటనే స్పందించి, పెళ్లి సమయానికి బాసటగా నిలిచిన దాతలందరికీ ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. నూతన జీవితంలోకి అడుగుపెట్టిన దివ్య భవిష్యత్తు ఎంతో సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మద్దెల దినేష్, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు వివిధ సేవా సంఘాల నాయకులు పాల్గొని నవదంపతులను ఆశీర్వదించారు.



# మహిళా రైతు కూలీలకు 'ఉదయ్' చేయూత

**మహిళా సమానత్వ దినోత్సవం సందర్భంగా లంచ్ బ్యాగులు, బాక్సుల పంపిణీ**

**ప్రజా వాయిస్, ఆత్మకూరు (ఎం):**
మహిళా రైతు కూలీలకు అండగా నిలిచేందుకు ఉదయ్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లంచ్ బ్యాగులు, బాక్సులను పంపిణీ చేశారు. ఆత్మకూరు (ఎం) మండలం కూరెళ్ల గ్రామంలోని లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్‌లో మహిళా సమానత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు.ఎరుకల ఉదయ్ భాస్కర్ తన తల్లిదండ్రులు ఎరుకల కృష్ణమూర్తి, పద్మల గౌరవార్థం మహిళా రైతు కూలీలకు లంచ్ బ్యాగులు, బాక్సులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డ ముత్తమ్మ, ఉపసర్పంచ్ రమేష్ మాట్లాడుతూ.. మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మహిళల సాధికారతకు సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



# ఇంటింటా మొక్కలు.. పచ్చదనానికి బాటలు

**సాయినగర్‌లో వన మహోత్సవం.. ప్రతి ఇంటికీ మొక్కల పంపిణీ**

**ప్రజా వాయిస్, మోత్కూర్:**
వన మహోత్సవంలో భాగంగా మోత్కూర్ మున్సిపాలిటీ 12వ వార్డు సాయినగర్‌లో బుధవారం ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌన్సిలర్ మెంట రమణ నగేష్ ఆధ్వర్యంలో కాలనీలోని ప్రతి ఇంటికీ మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.కౌన్సిలర్ మెంట రమణ నగేష్ మాట్లాడుతూ.. పట్టణాల్లో పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి, వాటిని బాధ్యతగా సంరక్షించాలని కోరారు. మొక్కలు నాటడం ద్వారా స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడటంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చన్నారు. వన మహోత్సవాన్ని కేవలం కార్యక్రమాలకే పరిమితం చేయకుండా మొక్కల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ షాకిరుద్దీన్, అన్నెపు యాకు, కాలనీవాసులు వీరమల్లు శ్రీను, మచ్చగిరి, అన్నెపు రాములు, మరాఠి ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**రూ.10 వేల ఆపన్నహస్తం..**
**పవన్ సాయి హాస్పిటల్ అధినేత శ్రీనివాస్‌గౌడ్ పరామర్శ**



**ప్రజా వాయిస్/అడ్డగూడూరు:**
మండల పరిధిలోని లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన పొన్నాల వెంకన్న ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న పవన్ సాయి హాస్పిటల్ అధినేత ఆలేటి శ్రీనివాస్‌గౌడ్ బుధవారం వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం వెంకన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పట్ల సీఎం రేవంత్ చిన్నచూపు

**విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలి**
**విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే అసెంబ్లీ ముట్టడిస్తాం**
**ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి**

**ప్రజా వాయిస్, గోదావరిఖని :**
విద్యార్థుల పట్ల సీఎం రేవంత్ చిన్నచూపు చూస్తున్నాడని, సీఎం వద్ద విద్యా శాఖ ఉన్నా విద్యార్థులకు ఉపయోగం లేదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి విమర్శించారు.బుధవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో సాయి ఆజాద్ అధ్యక్షతన జరిగిన జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు.అనంతరం మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యార్థినులకు ఇస్తామన్న స్కూటీలు, విద్యార్థులకు ఇస్తామన్న ల్యాప్‌టాప్‌లను, 5లక్షల విద్య భరోసా కార్డును, పెండింగ్ ఫీజు బకాయిలను అధికారంలోకి వచ్చి 34 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఎందుకు ఇవ్వలేదని, సీఎం రేవంత్ రెడ్డి తన వద్ద విద్యాశాఖ పెట్టుకొని విద్యార్థుల హామీల అమలు చేయకుండా విద్యార్థులకు ఓట్లు లేవని చిన్నచూపు చూస్తున్నాడని, సీఎం రేవంత్ రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్న విద్యార్థులకు ఉపయోగం లేకుండా పోయిందని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి నియామకం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు.రాష్ట్రంలో విద్యార్థులు సమస్యల కోసం ప్రతి రోజు రోడ్డు ఎక్కుతున్నారని,సీఎం వద్ద విద్యాశాఖ ఉంది కమిషన్ల కోసమేనని విమర్శించారు.విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడకుండా బడ్జెట్ లో 15%నిధులు ఇవ్వాలని ,విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని, లేని పక్షంలో ఢిల్లీ తరహా ఉద్యమాన్ని తెలంగాణ గల్లీలలో విద్యార్థులను ఏకం చేసి ఉద్యమిస్తామని అన్నారు.సెప్టెంబర్ 7నుండి




జరుగు అసెంబ్లీ సమావేశాల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించాలని లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రేణుకుంట్ల ప్రీతం, మామిడిపల్లి హేమంత్, ఎల్కపల్లి సురేష్,లక్ష్మీ ప్రసన్న, తడిగొప్పుల అనూప్ సాయి, అభిషేక్,ఆరే జశ్వంత్, గొడిసెల ప్రణీత్, రాహుల్ ,సూర్య ప్రకాష్, సాయి, మహి, సాయి శరణ్య తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువత జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటం

**ఖాళీల భర్తీ, ఉద్యోగ హక్కు కోసం యువత సంఘటితం కావాలి**
**సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు**

**జూలూరుపాడు, ప్రజా వాయిస్:**
నిరుద్యోగ యువత జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయని, దేశ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ ఖాళీల భర్తీ, ఉద్యోగ హక్కు కోసం యువత సంఘటితం కావాలని సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ జూలూరుపాడు మండల మహాసభ స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో చీమకుర్తి సంతోష్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



శాశ్వత ఉద్యోగాల భర్తీ పై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రభుత్వ శాఖల్లో భారీ సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికీ నియామకాలు సకాలంలో పూర్తి కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, ఔట్‌సోర్సింగ్ విధానాల వల్ల శాశ్వత ఉద్యోగ అవకాశాలు తగ్గి యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రభుత్వాలు ఉద్యోగ కల్పనను హక్కుగా కాకుండా ఎన్నికల హామీలకే పరిమితం చేస్తున్నాయని విమర్శించారు. స్థానిక ఉపాధి అవకాశాలు పెంచే పరిశ్రమలు ఏర్పాటు చేయడం, ప్రభుత్వ ఖాళీలను వెంటనే భర్తీ చేయడం, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు, యువజన సదుపాయాలు ఏర్పాటు చేయడం ద్వారా ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాస రోశయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ, కొండా వీరయ్య, రమేష్, సుధా, ఎస్కే బోలేమియా, సతీష్, వంశీ, వెంకటేశ్వర్లు, సురేష్, నరేష్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టులు పూర్తి చేయాలి..

**29 నుంచి భువనగిరి,హైదరాబాద్ పాదయాత్ర..31న మహాధర్నా**
**ఇందిరాపార్క్‌కు రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరండి: సీపీఎం నేతల పిలుపు**

**ప్రజా వాయిస్, మోత్కూరు:**
యాదాద్రి భువనగిరి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న ఆందోళనలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మోత్కూరు మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు పిలుపునిచ్చారు. ఈ నెల 29, 30, 31 తేదీల్లో భువనగిరి నుంచి హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. 31న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాకు రైతులు,



కూలీలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. బుధవారం మండలంలోని పాలడుగు, రాగిభావి గ్రామాల్లో రైతులు, కూలీలతో కలిసి మహాధర్నాకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని



డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, పానుగుల రమేష్, శాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య, ఎన్నం వెంకట్‌రెడ్డి, దడిపల్లి సైదులు, వడ్డేపల్లి లక్ష్మణ్, రైతులు మర్రిపల్లి యాదయ్య, బోడిగె యాదయ్య, మిడిదొడ్డి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాలేరు మనది..పాలేరు నీరు మన రైతులదే!

**పాలేరు రైతుల పక్షాన బీఆర్ఎస్ సమరశంఖం**
**నాడు మంత్రులతో కొట్లాడి నీళ్లు తెచ్చాం..**
**నేడు అన్నదాతలను గోస పెడతారా?**
**అర్ధరాత్రి ఆపదొచ్చినా ఆదుకున్నాం..**
**అబద్ధపు హామీలు మన రక్తంలోనే లేవు:**
**కందాల ఘాటు వ్యాఖ్యలు**
**పాలేరు గడ్డపై గతం-వర్తమానంపై మొదలైన అసలైన చర్చ !**



**ప్రజా వాయిస్ ఖమ్మం:**
ఈ పాలేరు గడ్డ బిడ్డగా గొంతెత్తి చెబుతున్నా.. పాలేరు మనది.. పాలేరు చెరువు నీటిపై మొదటి సంపూర్ణ హక్కు ఇక్కడి అన్నదాతలకే చెందుతుంది. గతంలో మన ప్రాంత నీళ్లను ఇతర ప్రాంతాలకు తరలించే ప్రయత్నం జరిగినప్పుడు అప్పటి మంత్రులతో సైతం రాజీలేని పోరాటం చేసి, మన పాత కాల్వ ఆయకట్టు రైతులకు చివరి ఎకరం వరకు నీళ్లు అందించిన చరిత్ర మనది. ఇవాళ రిజర్వాయర్‌లో పుష్కలంగా నీటి లభ్యత ఉన్నప్పటికీ పంటలకు విడుదల చేయకుండా రైతుల కడుపు కొడుతున్నారు. మన రైతుల హక్కులను కాలరాస్తామంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు అని పాలేరు మాజీ శాసనసభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి పాలక వర్గానికి ఘాటు హెచ్చరికలు జారీ చేశారు.ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల కేంద్రంలో స్థానిక బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య అధ్యక్షతన నిర్వహించిన బూత్ లెవెల్ విస్తృత స్థాయి సమన్వయ సమావేశంలో కందాల ముఖ్య అతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు.నాడు కేసీఆర్ నాయకత్వంలో అన్నివర్గాల ప్రజలు ఎంత సంతోషంగా ఉన్నారు.. నేడు కాంగ్రెస్ పాలనలో రైతులు, పేదలు, సామాన్యులు పడుతున్న గోస ఏంటి? అనే అంశంపై పాలేరు గల్లీగల్లీలో తీవ్రస్థాయి చర్చ మొదలైందని కందాల అన్నారు. అర్ధరాత్రి లేదు.. అపరాత్రి లేదు.. కష్టమొచ్చి గడప తొక్కిన వారు ఏ పార్టీ వారైనా, ఎలాంటి వారైనా వీడు మనవాడు కాదు అనే సంకుచిత భావన లేకుండా సొంత మనిషిలా గుండెలకు హత్తుకుని ఆదుకున్నాం. కరోనా వంటి భయంకరమైన విపత్తులో యావత్ ప్రపంచం గడప దాటడానికి భయపడినప్పుడు సైతం ప్రాణాలను పణంగా పెట్టి పాలేరు ప్రజల మధ్యే ఉండి అండగా నిలిచాం అని అన్నారు.రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను మోసం చేయడం, అమలుకాని అబద్ధపు హామీలు ఇవ్వడం మన సంస్కృతి కాదు. గత 8-9 ఏళ్లుగా మీతో నడుస్తున్న నా ప్రయాణంలో నిజాయితీ మాత్రమే నా సిద్ధాంతం. మాట ఇస్తే నిలబెట్టుకుంటా.. అబద్ధాలు చెప్పి పబ్బం గడుపుకోవడం చేతకాదనీ తెలియజేశారు.ప్రస్తుతం పంటలు నీరందక ఎండిపోయే ప్రమాదం ఉన్నా పాలకులు మొద్దునిద్ర నటిస్తున్నారని మండిపడ్డారు. పాలేరు చెరువు కేవలం మన నియోజకవర్గ రైతుల కోసమే ఏర్పడిందని, మొదటి ప్రాధాన్యత ఇక్కడికే దక్కాలని స్పష్టం చేశారు. రైతుల సాగునీటి హక్కులను కాపాడేందుకు రాబోయే 2వ తేదీ నుండి 9వ తేదీ వరకు భారీ ఎత్తున నిరసన, ఉద్యమ కార్యాచరణ చేపట్టి పాలకుల మెడలు వంచుతామని పిలుపునిచ్చారు.ప్రతి బూత్‌లో 500 నుండి 600 మంది ఓటర్లతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలి. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి నాటి అభివృద్ధి, సంక్షేమానికి.. నేటి అస్తవ్యస్త పాలనకు మధ్య గల తేడాను విడమర్చి చెప్పాలి. భార్యాభర్తలు సైతం గతం-వర్తమానంపై ఆలోచించేలా క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యవంతం చేయాలి.ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, సర్పంచ్ లు అమరగాని ఎల్లయ్య, రంగయ్య, కమధనపు ప్రవీణ్, సైది రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ నాగుబండి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ మరికంటి ధనలక్ష్మి, సుధాకర్, పట్టణ అధ్యక్షులు గడ్డం లక్ష్మయ్య, ఎండి వాజిద్, అవుట మధు, మాదాసు ఆదాము, వినయ్, కిషోర్, శ్రీకాంత్ వార్డు మెంబర్లు మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మేడ్చల్ జిల్లా..కీసర...

**ఇందిరమ్మ ఇల్లుతో నెరవేరిన సొంతింటి కల, యాద్గర్‌పల్లిలో ఘనంగా గృహప్రవేశ వేడుకలు**

**ప్రజల సంతోషమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం**

**కీసర డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామిడి స్వప్న విజయ్ రెడ్డి.**

**ప్రజా వాయిస్, కీసర :** మేడ్చల్ జిల్లా మేడ్చల్ నియోజకవర్గం కీసర డివిజన్ పరిధిలోని యాద్గర్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కీసర డివిజన్ వన్ అధ్యక్షురాలు రామిడి స్వప్న విజయ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ప్రజా ప్రభుత్వం అందించిన నూతన గృహంలోకి అడుగుపెట్టిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు స్వప్న మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనలో ప్రజా ప్రభుత్వం లో రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉండాలనదే లక్ష్యం అన్నారు. గూడులేని ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇంటితో వారి కల ప్రజా ప్రభుత్వం లోనే సాధ్యమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రజా ప్రభుత్వానికి అండగా ఉంటారని పేర్కొన్నారు.సొంతింటి



కల నెరవేరిన సందర్భంగా లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ, తమ కుటుంబానికి ఇల్లు కల్పించడంలో సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బోయిని సరళ, దర్శన్ కుటుంబాలకు పలువురు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రామిడి విజయ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, తాటాకం లక్ష్మణ్ శర్మ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంధకారంలోకి యువత భవిష్యత్తు

- డ్రగ్స్ మత్తులో దారి తప్పుతున్న యువత
- నేరాలకు దారితీస్తున్న మత్తు ప్రభావం
- డ్రగ్స్ రహిత సమాజం కోసం సమష్టి పోరాటం అవసరం
- నేటి నిర్లక్ష్యం..రేపటి తరాల భవిష్యత్తుకు పెను ప్రమాదం

**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:**
డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతోంది. ముఖ్యంగా యువత సరదాగా మొదలుపెట్టిన మత్తు అలవాటుకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. మత్తు ప్రభావం ఆలోచనా శక్తి, విచక్షణను దెబ్బతీయడంతో గొడవలు, దాడులు, దొంగతనాలు వంటి నేరాలకు దారితీసే ప్రమాదం ఉంది. కొన్ని సందర్భాల్లో హత్యలు, లైంగిక దాడులు వంటి




తీవ్ర నేరాలకు కూడా మత్తు దోహదపడుతోంది.

**తల్లిదండ్రులు అప్రమత్తం కావాలి**
యువత ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు, అనుమానాస్పద స్నేహాలు, చదువు లేదా ఉద్యోగంపై ఆసక్తి తగ్గడం వంటి సంకేతాలను తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకూడదు. పిల్లలతో స్నేహపూర్వకంగా మెలిగి వారి సమస్యలను తెలుసుకోవాలి

**సమష్టి పోరాటం అవసరం**
డ్రగ్స్ నియంత్రణలో పోలీసులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, ప్రజలు కీలక పాత్ర పోషించాలి. మత్తు పదార్థాల సరఫరాపై కఠిన నిఘా పెట్టడంతో పాటు యువతలో అవగాహన పెంచాలి. మత్తుకు బానిసైన వారికి కౌన్సెలింగ్, పునరావాస సహాయం అందించాలి.యువతే దేశ భవిష్యత్తు. డ్రగ్స్ మహమ్మారిని ఇప్పుడే అడ్డుకోకపోతే భావితరాల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైంది.



## వడ్డి వ్యాపారుల ఆగడాలను వెంటనే అరికట్టాలి

**-పేద ప్రజలను పీడిస్తున్న వడ్డీ వ్యాపారులు,**
**-వడ్డీలకు చక్రవడ్డి,బారువడ్డీ అంటూ సొమ్ము చేసుకుంటున్నా దళారులు,**
**-నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మంగళంపల్లి హుస్సేన్**

**తొర్రూర్ ప్రజా వాయిస్...**
మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ వడ్డీ వ్యాపారుల ఆగడాలను వెంటనే అరికట్టాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతియ అధ్యక్షులు డాక్టర్ మంగళంపల్లి హుస్సేన్ అన్నారు. బుధవారం తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని గెస్ట్ హౌస్ లో జరిగిన ప్రెస్ మీట్ లో వారు మాట్లాడుతూ తొర్రూర్ డివిజన్ కేంద్రంలో వడ్డీ వ్యాపారం మితిమీరి కొందరి ప్రాణాల మీదికి వచ్చిందని అలాంటివారిని వెంటనే కేసు నమోదు చేయాలని అన్నారు. డివిజన్ కేంద్రానికి చెందిన ఏ టు జెడ్ మెడికల్ షాపు పల్లెర్ల రమేష్ (నేషనల్ హ్యూమన్ రైట్స్ డివిజన్ అధ్యక్షులు)వడ్డీ వ్యాపారుల ఆకృత్యాలకు బలై వారి యొక్క ఒత్తిడులను తట్టుకోలేక మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించగా అతన్ని వెంటనే వరంగల్ లోనే ఒక ప్రైవేట్ హాస్పిటల్ కు తీసుకెళ్లడం జరిగిందని,, ఇప్పుడు అతని పరిస్థితి విషమంగా ఉందని, చేసుకోవడానికి కారణమైన వ్యక్తులపై వెంటనే సుమోటోగా కేసు నమోదు చేసి, అరెస్టు చేసి, వడ్డీ వ్యాపారుల అఘాయిత్యాలను అరికట్టాలని సూచించారు . ఇలాంటి చర్యలను హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో తీవ్రంగా ఖండిస్తున్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కమిటీ మెంబర్ దేశగాని అశోక్ గౌడ్, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గంధం లాలయ్య, -జిల్లా కమిటీ సభ్యులు కుంభం మహేష్,-పెద్దవంగర మండల చైర్మన్ డాక్టర్ కుమ్మరి రామ్మూర్తి,డివిజన్ కమిటీ సభ్యులు మదేని మహంకాళి సభ్యులు తదితరులు ఉన్నారు.



## రెబ్బెనలో బీఆర్ఎస్‌లో పలువురు చేరిక

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గోలేటికి చెందిన మునికుంట్ల ప్రకాష్, పోతరాజుల అనసూయ, ధారావత్ రాజేష్, ఆకాష్ ఆడె, రాజేష్ ఆత్రం, కుమ్మరి రాజేష్‌తో పాటు మరికొందరు బుధవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కిర్మిళ్ల వినోద్ అధ్వర్యంలో పార్టీలో చేరారు.

**జెండా గద్దె నిర్మాణ స్థలం పరిశీలన**
రెబ్బెన మండలంలోని రైల్వే నంబల చౌక్ వద్ద పార్టీ జెండా గద్దె నిర్మాణ స్థలాన్ని బీఆర్ఎస్ నాయకులు బుధవారం పరిశీలించారు. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు ప్రతి మండలంలో పార్టీ జెండా ఎగురవేసి సభ్యత్వ నమోదు చేపట్టనున్నట్లు జిల్లా అధ్యక్షులు కిర్మిళ్ల వినోద్ తెలిపారు.ఈ కార్యక్రమం డాక్టర్ అశోక్ మహుల్కర్, దుర్గం శ్యామ్‌రావు, చౌహాన్ పుష్పలత, సాయి, తిరుపతి, అరుణ్, ఇంద్రజిత్, శ్యామ్‌రావు లాహుజి. పాల్గొన్నారు

## కౌటలలో గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**
కౌటల మండల కేంద్రంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొమరం మాంతయ్య సోదరుడు సకారం నూతన గృహప్రవేశ కార్యక్రమం జరిగింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సీడం గణపతి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.నూతన గృహ యజమానులకు నూతన వస్త్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.



## ఉట్నూర్‌లో ట్రైబల్ జర్నలిస్ట్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**
ఉట్నూర్ మండలం లింగోజితండా ఎక్స్‌రోడ్డు గ్రామంలో నూతన ట్రైబల్ జర్నలిస్ట్ అసోసియేషన్ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఐటీడీఏ ఏపీఓ జాదవ్ వసంత్‌రావు, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్, స్థానిక సర్పంచ్ మాయ జాదవ్, ఉపసర్పంచ్ హరినాయక్ జాదవ్ రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు.జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వ్యవహరిస్తారని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేకంగా ట్రైబల్ జర్నలిస్టుల అసోసియేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, గ్రామీణ సమస్యల పరిష్కారానికి ముందుకు సాగాలని కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రైబల్ జర్నలిస్ట్



అసోసియేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు లాకావత్ రమేష్, కార్యదర్శి మాడవి మాణిక్‌రావు, చవాన్ రామేశ్వర్, కోశాధికారి జాదవ్ వసంత్‌రావు, ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్, ఆసిఫాబాద్-కొమురంభీం జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్రం రాము, ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు రాథోడ్ అజయ్, ప్రచార కార్యదర్శి సిడం కైలాష్, రాథోడ్ నాందేవ్, జాయింట్ సెక్రటరీ జాదవ్ రవికిరణ్, భీమ్‌రావు, రవీందర్, మనోజ్, పీత నాయక్, దత్త తదితరులు పాల్గొన్నారు

## కౌటాలలో కాంగ్రెస్ మండల సమావేశం

**ఎస్ఐఆర్ ఫేజ్-2పై ఆత్రం సుగుణ సమీక్ష**

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**
కౌటాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, ఎమ్మెల్సీ దండే విఠల్ హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలతో మండల స్థాయి కార్యక్రమాలపై చర్చించారు. మండల కమిటీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.ఎస్ఐఆర్ ఫేజ్--2లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా పరిశీలనపై సుగుణ పార్టీ శ్రేణులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో అనమాలీస్ జాబితాలో గణనీయ సంఖ్యలో ఓట్లు ఉన్నాయని, అందులో అర్హులైన ఓటర్ల పేర్లు కూడా ఉండే అవకాశం ఉన్నందున ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన ఆధారాలతో ఫారం--7 సమర్పించేలా ఓటర్లకు



అవగాహన కల్పించాలని తెలిపారు. నోటీసుల కోసం వేచి చూడకుండా బూత్ స్థాయిలోనే జాబితాను పరిశీలించి సమస్యలను గుర్తించాలని సూచించారు. ప్రతి బూత్‌లో కాంగ్రెస్ బీఎల్ఏలు, నాయకులు సమన్వయంతో పనిచేస్తూ ఎస్ఐఆర్--2 ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల కమిటీ ఎన్నికలను సమర్థవంతంగా పూర్తి చేయాలని కోరారు.

## మొఘడ్ ధగడ్ ఆశ్రమ పాఠశాల సమస్యల పరిష్కారానికి వినతి

**ప్రజా వాయిస్ కౌటాల**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం మొఘడ్ ధగడ్ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్సీ దండే విఠల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణకు వినతిపత్రం అందజేశారు.విద్యార్థులు ఎదుర్కొంటున్న



సమస్యలు, మౌలిక వసతుల కొరత, విద్యాభివృద్ధికి అవసరమైన సదుపాయాల అంశాలను వినతిపత్రంలో వివరించారు. మెరుగైన విద్య, వసతి, భోజనం, తాగునీరు, పారిశుధ్యం సౌకర్యాలతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు.విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని దండే విఠల్, ఆత్రం సుగుణ హామీ ఇచ్చారు.

## మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో ఘనంగా తేజ్ వేడుకలు....



**ప్రజా వాయిస్/ నల్గొండ క్రైమ్:**
నల్గొండ జిల్లా మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో గిరిజన విద్యార్థుల ఆధ్వర్యంలో తేజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.విద్యార్థుల్లో ఐక్యత, సాంస్కృతిక చైతన్యం, సంప్రదాయాల పరిరక్షణను పెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, నృత్యాలు తదితర కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.తేజ్ పండుగ విశిష్టత, గిరిజన సంస్కృతి, సంప్రదాయాల గురించి విద్యార్థులు వివరించారు.ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థులు సతీష్, ఆకాశ్, దేవదాస్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంలో ఇలాంటి వేడుకలు ఎంతో దోహదపడతాయని విద్యార్థులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ విద్యార్థులు సతీష్ దేవదాస్ ఆకాష్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు...

## కుమార్తె మృతితో మనస్తాపం....వ్యక్తి ఆత్మహత్య

**శామీర్ పేట / ప్రజా వాయిస్ :**
కుమార్తె మృతి కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన తండ్రి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శామేర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బొమ్మరాసిపేట గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. లాల్‌గడి మలక్‌పేట్‌కు చెందిన రాములు (50) మేస్త్రీగా పనిచేస్తున్నాడు. కుమార్తె మృతితో తీవ్ర నిరాశ, మనస్తాపానికి గురైన ఆయన బొమ్మరాసిపేట గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.బుధవారం సాయంత్రం 5.15 గంటలకు డయల్-112కు సమాచారం అందడంతో శామీర్‌పేట సీఐ, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు



నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శామీర్‌పేట ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు అరుణ్‌కుమార్ ఉన్నారు. అరుణ్‌కుమార్ శామీర్‌పేటలోని ఓ ఫర్నిచర్ కంపెనీలో పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

# బుద్వేల్ లో ల్యాండ్ మాఫియా పంజా.!

**పంపు హౌస్ స్థలంపై భూ బకాసురుల కన్ను**

**39 ఏండ్ల నాటి ప్రభుత్వ నిర్మాణాన్ని కూల్చేందుకు యత్నం.!**

**దివంగత నేత మాజీ మంత్రి ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేసిన కట్టడాన్ని నేలమట్టం చేసే కుట్ర**

**అడ్డుకున్న స్థానిక నివాసితులు.!**



**ప్రజా వాయిస్,రాజేంద్రనగర్:**
పోలీస్ స్టేషన్ పరిధిలో 'భూ'మాఫియా బరితెగింపు పరాకాష్ఠకు చేరింది."కన్ను పడిందా' ఖాతా క్లోజ్ చేయాల్సిందే." అనే రీతిలో విరుచుకుపడుతున్న కబ్జాదారులు,ఏకంగా ప్రజల తాగునీటి అవసరాల కోసం కేటాయించిన పంప్ హౌజ్ స్థలాన్నే మింగేసేందుకు తెగబడ్డారు. వివరాల్లోకి వెళితే బుద్వేల్ గ్రామం, శ్రీశ్రీ కోటమైసమ్మ కాలనీలోని సర్వే నంబర్ 211/1/అఅ లో పంప్ హౌస్ కోసం కేటాయించిన సుమారు 70 గజాల విలువైన స్థలంపై స్థానికుల చొరవతో కన్నేసిన అక్రమార్కులు,జేసీబీతో వచ్చి విధ్వంసానికి దిగడం తీవ్ర కలకలం రేపింది.

**చరిత్రను చేరిపేసేందుకు పక్కా స్కెచ్**
ప్రజా సంక్షేమం కోసం అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి, దివంగత పట్లోళ్ళ ఇంద్రారెడ్డి 15.08.1987 నాడే ఈ పంప్ హౌస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.గత 39 ఏండ్లుగా ప్రజా ఉపయోగంలో ఉన్న ఈ స్థలాన్ని,దానిపై ఉన్న చారిత్రక నిర్మాణాన్ని రాత్రికి రాత్రే తుడిచిపెట్టేందుకు కబ్జాదారులు పక్కా వ్యూహం పన్నారు. శనివారం హఠాత్తుగా జేసీబీతో స్థలంలోకి దూసుకొచ్చి,39 ఏండ్ల క్రితం నిర్మించిన గదిని నేలమట్టం చేసేందుకు యత్నించారు.

**అడ్డుకున్న కాలనీవాసుల**
జేసీబీ శబ్దాలు విని, "భూ"బకాసురుల కుట్రను గమనించిన శ్రీశ్రీ కోటమైసమ్మ కాలనీ నివాసితులు ఒక్కసారిగా తిరగబడ్డారు.స్థానిక ప్రజలంతా ఏకమై జేసీబీని కబ్జారాయుల్లను చుట్టుముట్టి కబ్జా యత్నాన్ని సాహసోపేతంగా అడ్డుకున్నారు. కాలనీవాసుల తిరుగుబాటుతో కబ్జాదారులు తోకముడిచారు.



**పోలీస్ స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు**
తమ కాలనీ ఆస్తిని,సర్వే నం: 211/1/అఅ లోని పంప్ హౌస్ స్థలాన్ని కాపాడాలని, దివంగత నేత ఇంద్రారెడ్డి ప్రారంభించిన నిర్మాణాన్ని ధ్వంసం చేసేందుకు యత్నించిన అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ స్థలం తమదే అంటూ అక్కడ ఉన్న గదిని నేలమట్టం చేస్తున్న సమయంలో కాలని వాసులు తమను అడ్డుకున్నారంటూ కబ్జాదారులు సైతం పోలీసులను ఆశ్రయించడంతో ఇరువర్గాలు ఫిర్యాదులు చేసుకున్నాయి.



**స్థానికులు మాట్లాడుతూ**
39 ఏండ్ల క్రితం తమ కాలనిలో పంప్ హౌజ్ నిర్మించడం జరిగింది. ఇప్పుడు వచ్చి ఈ స్థలం తమదే అంటు కొందరు జేసిబి తీసుకువచ్చి ఆ గదిని నేలమట్టం చేసి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తుండగా అందరం కలిసి అడ్డుకున్నాము. లే ఔట్ వేసిన సమయంలో ప్లాట్లు కొన్నవారికి రిజిస్ట్రేషన్ చేసే సమయంలో ఇది పంప్ హౌజ్ కోసం వదిలిన స్థలం అని అందరి రిజిస్ట్రేషన్ దస్త్రాల్లో స్పష్టంగా రాసి ఉందన్నారు.ఇప్పుడు వచ్చి ఈ స్థలం తమదే అని ఎలా అంటారని పంప్ హౌజ్ ను ఎలా కూల్చివేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఏకంగా ప్రభుత్వ కేటాయింపులు,చారిత్రక ఆధారాలు ఉన్న పంప్ హౌస్ స్థలాన్ని ఆక్రమించేందుకు తెగబడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ విషయంపై రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామని అన్నారు.మున్సిపల్,రెవిన్యూ, జలమండలి,అధికారులను కలసి ఫిర్యాదు చేస్తామన్నారు.జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి భూ బకాసురులపై పిడియాక్ట్ కింద కేసులు నమోదు చేసి,సర్వే నంబర్ 211/1/అఅ,స్థలానికి రక్షణ కల్పించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మహిళా నాయకత్వం ఉన్నా..
# మహిళలకు గౌరవం ఏదీ..?

- -మోత్కూరులో పబ్లిక్ టాయిలెట్ల కరువు..
- -ముగ్గురు మహిళా చైర్‌పర్సన్లు మారినా మారని పరిస్థితి
- -ప్రధాన కూడళ్లలో కనీసం మూత్రశాలలు లేవు
- - ఉన్న టాయిలెట్లకు నీరు, నిర్వహణ కరువు
- - అంబేద్కర్ చౌరస్తా, ఎస్‌బీఐ వద్ద తీవ్ర ఇబ్బందులు
- - బ్యాంకు పనుల కోసం వచ్చే మహిళలకు తప్పని తిప్పలు
- - ఇకనైనా శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజల డిమాండ్



**ప్రజా వాయిస్,మోత్కూరు:**
మహిళా నాయకత్వం ఉన్నా.. మహిళల కనీస అవసరాలు తీరడం లేదు. మోత్కూరు మున్సిపాలిటీలో ముగ్గురు మహిళా చైర్‌పర్సన్లు బాధ్యతలు చేపట్టినా.. మహిళల ఆత్మగౌరవానికి సంబంధించిన పబ్లిక్ టాయిలెట్ల సమస్యకు మాత్రం పరిష్కారం లభించలేదు. పట్టణానికి నిత్యం వివిధ పనుల కోసం వచ్చే మహిళలు అత్యవసర సమయంలో టాయిలెట్ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**ఉన్నా.. నిరుపయోగమే**
చెరువు కట్ట, మార్కెట్ యార్డు, డాబంగ్లా, తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల సమీపంలో పబ్లిక్ టాయిలెట్లు ఉన్నప్పటికీ.. నీటి వసతి, పరిశుభ్రత, నిర్వహణ లోపంతో అవి ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడటం లేదనే విమర్శలు ఉన్నాయి. నిర్మాణాలు చేపట్టడంతోనే అభివృద్ధి పూర్తయినట్లు కాదని.. వాటిని నిరంతరం నిర్వహించాల్సిన బాధ్యత కూడా మున్సిపాలిటీదేనని ప్రజలు అంటున్నారు.

**ప్రధాన కూడళ్లలో కరువు**
పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, ఎస్‌బీఐ పరిసరాల్లో కనీసం మూత్రశాలలు కూడా లేకపోవడం మహిళలకు ఇబ్బందిగా మారింది. ఆత్మకూర్, అడ్డగూడూరు మండలాల నుంచి మహిళా సంఘాలతో పాటు వందలాది మంది మహిళలు బ్యాంకు, ఇతర పనుల కోసం మోత్కూరుకు వస్తుంటారు. అత్యవసర పరిస్థితుల్లో టాయిలెట్ సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు.

**ఆత్మగౌరవ సమస్య**
మహిళలకు సురక్షితమైన పబ్లిక్ టాయిలెట్లు అందుబాటులో లేకపోవడం కేవలం పారిశుధ్య సమస్య కాదని.. వారి గౌరవం, భద్రతకు సంబంధించిన అంశమని స్థానికులు పేర్కొంటున్నారు. మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి పాలకవర్గాలు, అధికారులు మారినా సమస్య పరిష్కారం కాకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా కీలక ప్రాంతాల్లో మహిళలకు ప్రత్యేక టాయిలెట్లు ఏర్పాటు చేసి, ఇప్పటికే ఉన్న వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



# వేయించిన పదార్థాలు వద్దు

పొట్ట చుట్టూ కొవ్వు పేరుకు పోకుండా ఉండాలంటే.. వేయించిన పదార్థాలను పక్కన పెట్టేయాలని నిపుణులు సలహా ఇస్తున్నారు. నూనెలను వేడి చేసినప్పుడు అందులో ట్రాన్స్‌ఫ్యాట్స్ ఏర్పడుతాయి. కాబట్టి, డీప్ ఫ్రై, నూనెతో తయారు చేసిన పదార్థాల్లో ఈ ట్రాన్స్‌ఫ్యాట్స్ ఎక్కువగా పేరుకు పోతాయి. ఆ పదార్థాలను తింటే.. శరీరంలో కొవ్వు పేరుకుపోతుంది.డయాబెటిస్, గుండె జబ్బులు వచ్చేందుకూ ఆస్కారం ఉంది. నూనె పదార్థాలను మానేయడం వల్ల పొట్ట దగ్గరి కొవ్వు కరుగుతుంది. అప్పుడప్పుడూ 'ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్'ను అనుసరించాలి. అంటే రోజులో 6 గంటల పాటు మాత్రమే తిని, మిగతా 18 గంటల పాటు జీర్ణాశయాన్ని ఖాళీగా ఉంచాలి. ఇలా చేస్తే.. పొట్ట చుట్టూ పేరుకు పోయిన కొవ్వు కరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.



## వేసవిలో తప్పక తినాల్సిన పండ్లు ఇవే




ఇంటర్నెట్ డెస్క్: వేసవి ఎండలు రోజురోజుకీ తీవ్రంగా మారుతున్నాయి. ఉదయం నుంచే పెరుగుతున్న ఉష్ణోగ్రతలు బయటకు వెళ్లడాన్ని కష్టతరం చేస్తున్నాయి. ఈ వేడి కారణంగా శరీరంలో నీటి శాతం డీహైడ్రేషన్, జీర్ణ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. తాత్కాలిక ఉపశమనం కోసం తీపి పానీయాలపై ఆధారపడటం కంటే, సహజంగా శరీరాన్ని చల్లగా ఉంచే పండ్లు తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

**పుచ్చకాయ:**



వేసవిలో ఎక్కువగా తినాల్సిన పండు పుచ్చకాయ. ఇందులో నీటి శాతం ఎక్కువగా ఉండటంతో దాహం తీరుతుంది. జీర్ణక్రియకు కూడా ఇది సహాయపడుతుంది.

**బొప్పాయి:**
జీర్ణ సమస్యలు తగ్గించడానికి బొప్పాయి చాలా ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే ఎంజైములు ఆహారం సులభంగా జీర్ణం కావడానికి సహాయపడతాయి.

**మామిడి:**



వేసవి కాలం అంటేనే మామిడి పండ్ల సీజన్. ఇది శరీరానికి శక్తినిస్తుంది, పేగులకు చాలా మంచిది. కానీ ఎక్కువగా తింటే బరువు పెరగడం, చక్కెర స్థాయిలు పెరగడం జరుగుతుంది. కాబట్టి మితంగా తినాలి.

**అరటిపండ్లు:**



అరటి పండ్లు పోషకాల గని. తక్షణ శక్తినిచ్చే అద్భుతమైన పండు. ఇవి పొటాషియం, విటమిన్లు, ఫైబర్‌తో నిండి ఉండి, గుండె ఆరోగ్యం, రక్తపోటు నియంత్రణ, జీర్ణక్రియకు ఎంతో మేలు చేస్తాయి. సీజన్‌తో సంబంధం లేకుండా చౌకగా లభించే ఈ పండ్లు శరీర పెరుగుదలకు, ఎముకల దృఢత్వానికి చాలా అవసరం.

**పైనాపిల్:**
పైనాపిల్‌లో జీర్ణక్రియకు సహాయపడే ఎంజైములు ఉంటాయి. ఇవి శరీరంలో వాపు తగ్గించడంలో కూడా సహాయపడతాయి. వేసవిలో కేవలం శీతల పానీయాలపై ఆధారపడకుండా, ఇలాంటి సహజ పండ్లు తినడం వల్ల శరీరం చల్లగా ఉండటంతో పాటు ఆరోగ్యంగా ఉంటుంది.



# ‘టాక్సిక్’ దర్శకురాలు ఎమోషనల్.. యశ్ నన్ను నమ్మాడు!

రాకింగ్ స్టార్ యశ్ కథానాయకుడిగా నటిస్తున్న ‘టాక్సిక్: ఏ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్ అప్స్’ సినిమాతో రేపు (ఆగస్టు 26) ప్రేక్షకుల ముందుకు రాబోతున్న డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్, తన తండ్రి తనకు ఇచ్చిన ఒక అమూల్యమైన సలహాను గుర్తుచేసుకున్నారు. చెన్నైలో జరిగిన ఈ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడుతూ, తన సినీ ప్రయాణంలో ఎదురైన అనుభవాలను, హీరో యశ్ తనపై ఉంచిన నమ్మకాన్ని పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు.తన ప్రసంగాన్ని మొదలుపెడుతూ, “నేను నాలుగన్నరేళ్ల వయసులో సినిమా రంగంలోకి వచ్చాను. అక్కడి నుంచి ఇక్కడి వరకు నా ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటున్నాను. నేను స్కూల్లో చాలా యావరేజ్ స్టూడెంట్‌ని. అన్నింటిలోనూ ఫెయిల్ అయ్యేదాన్ని. నన్ను ఎవరూ ఏ ఆటకూ ఎంచుకునేవారు కాదు. ఒకరకంగా నేను పూర్తిగా విఫలమయ్యాననే చెప్పాలి” అని గీతూ తెలిపారు.ఆ సమయంలో తన తండ్రి చెప్పిన మాటలు తనలో నిలిచిపోయాయని అన్నారు. “‘నువ్వు ఏం చేయాలనుకుంటున్నావు? అన్నీ ఫెయిల్ అవుతున్నావు కదా, ఏమవ్వాలనుకుంటున్నావు?’ అని నాన్న అడిగారు. దానికి నేను ‘బేకర్’ అవుతానని చెప్పాను. అప్పుడు ఆయన, ‘అయితే సరే, ఆ పట్టణంలో నువ్వే అత్యుత్తమ బేకర్‌గా నిలవాలి’ అని చెప్పారు. ఆ మాట నా మదిలో నాటుకుపోయింది” అని ఆమె వివరించారు.ఆ సలహా వల్లే తాను ఏ పని చేసినా, ఎక్కడికి వెళ్లినా గుర్రానికి గంతలు కట్టినట్లుగా కేవలం తన లక్ష్యంపైనే దృష్టి పెట్టానని గీతూ పేర్కొన్నారు. “చుట్టూ ఉన్న శబ్దాలను పట్టించుకోలేదు. నన్ను ఎవరూ నిరుత్సాహపరచకుండా చూసుకున్నాను. నేను నా గమ్యాన్ని చేరాల్సిందే అని అనుకున్నాను” అని అన్నారు. ఇదే వేదికపై, తనను ఎవరూ నమ్మని రోజుల్లో హీరో యశ్ తనపై నమ్మకం ఉంచారని చెబుతూ ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.“ఈ రోజు నేను ఒకటి చెప్పగలను. నా చిన్నప్పటి నుంచి ఇప్పటి వరకు నా ప్రయాణంలో, ప్రపంచంలో అందరికంటే యశ్ నన్ను నమ్మారు. నా



కృతజ్ఞతను మాటల్లో చెప్పలేను. ఎందుకంటే అది ఒక ప్రతిధ్వని లాంటిది. ఒకరు నమ్మకంతో చప్పట్లు కొడితే, ఆ చప్పట్లను ప్రపంచం అనుసరిస్తుంది. ఆయన నన్ను నమ్మిన తర్వాతే, అందరూ నమ్మడం మొదలుపెట్టారు. అది ఒక గొలుసుకట్టు ప్రతిచర్యలా మారింది. ఆ మొదటి స్వరాన్ని నేను ఎప్పటికీ మర్చిపోలేను” అని గీతూ మోహన్‌దాస్ ఉద్వేగంగా తన ప్రసంగాన్ని ముగించారు.

# 27 ఏళ్లకే ఆటకు వీడ్కోలు.. తాను చదువుకున్న స్కూలే కారణమంటూ..

డెస్క్: ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ విల్ పుకోవిస్కీ 27 ఏళ్ల వయసులోనే క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. జాతీయ జట్టు తరఫున కేవలం ఒకే ఒక్క టెస్టు మ్యాచ్ ఆడాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 36 మ్యాచ్‌లు ఆడాడు. అయితే వరుసగా ఎదురైన కంకషన్ (తలకు బలమైన దెబ్బ కారణంగా మెదడుపై ప్రభావం) గాయాలతో అతడి క్రికెట్ కెరీర్ అర్ధంతరంగా ముగిసింది. తాజాగా తన కెరీర్‌ను తీవ్రంగా ప్రభావితం చేసిన తొలి కంకషన్ ఘటనకు సంబంధించి పుకోవిస్కీ తాను చదువుకున్న పాఠశాలపై న్యాయపోరాటానికి దిగాడు. తన కెరీర్ ఇలా అవ్వడానికి కారణం స్కూలేనని ఆరోపిస్తూ తాజాగా దావా వేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.మెల్‌బోర్న్‌లోని బ్రైటన్ గ్రామర్ స్కూల్‌లో విల్ విద్యనభ్యసించాడు. 2014లో ఆస్ట్రేలియన్ రూల్స్ ఫుట్‌బాల్ ట్రైనింగ్ సెషన్‌లో పాల్గొన్నాడు. అప్పుడు అతడి వయసు 16 ఏళ్లు. ఆ ఫుట్‌బాల్ సెషన్‌లో విల్ తలకు గాయమైంది. ‘ఆ సమయంలో స్కూల్ యాజమాన్యం సరైన వైద్యం అందించలేదు. దెబ్బ



తగిలిన కొద్ది నిమిషాలకే తిరిగి శిక్షణలోకి పంపిచారు. ఆ గాయం ప్రభావంతో నేను కొన్ని నెలల పాటు స్కూల్‌కు కూడా వెళ్లలేదు. అందుకే క్రికెట్ కెరీర్‌లో పలుమార్లు గాయాలబారిన పడాల్సి వచ్చింది’ అని విల్ ఆరోపించాడు.

**కెరీర్‌లో 13 కంకషన్లు!**

ఆ తొలి గాయం తర్వాత విల్ కెరీర్‌లో కంకషన్లు వెంటాడాయి. క్రికెట్ ఆడుతున్న సమయంలో అతడికి 13 కంకషన్లు నమోదయ్యాయి. చివరకు 2024లో స్వతంత్ర వైద్య నిపుణుల బృందం క్రికెట్ నుంచి తప్పుకోవాలని సిఫారసు చేయడంతో 27 ఏళ్ల వయసులోనే అతడు రిటైర్మెంట్ ప్రకటించాడు.

# భారత్-శ్రీలంక రెండో టెస్టు: నాలుగో రోజు ముగిసిన ఆట

డెస్క్: కొలంబో వేదికగా భారత్-శ్రీలంక మధ్య జరుగుతున్న రెండో టెస్టు నాలుగో రోజు ఆట ముగిసింది. వర్షం అంతరాయం కలిగించడంతో ముందే ఆటను నిలిపేయాల్సి వచ్చింది. మైదానాన్ని కవర్లతో కప్పి ఉంచారు. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఫాలో ఆన్‌లో శ్రీలంక స్కోర్ 229/6. క్రీజులో కేషారా నువాంత(3లి), సోనాల్ దినుశా(7లి) కొనసాగుతున్నారు. భారత్ కంటే శ్రీలంక 16 పరుగుల ఆధిక్యంలో ఉంది.ఓవర్‌నైట్ 265/8 స్కోరుతో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన శ్రీలంక.. మరో 25 పరుగులు జోడించి 290 పరుగులకు ఆలౌటైంది. దీంతో లంకతో భారత్ ఫాలో ఆన్ ఆడించింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 503/9 వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. భారత బౌలర్లలో మానవ్ సుతార్ 2, ప్రసిద్ధ్ కృష్ణ, సిరాజ్, సారాంశ్ జైన్, జడేజా తలొక వికెట్ పడగొట్టారు.



ఈ మ్యాచ్‌లో భారత్ విజయావకాశాలు వాతావరణంపై ఆధారపడి ఉన్నాయి. గురువారం వరుణుడు కరుణించి ఆటకు అంతరాయం కలిగించకపోతే టీమిండియా విజయం సాధించడం ఖాయమే.

## SPORTS

# కుర్రాళ్ల భవిష్యత్తుకే మంచిది కాదు..

ఐసీసీ, బీసీసీఐ చర్యలు తీసుకోవాలి: సంజయ్ మంజ్రేకర్



ఇంటర్నెట్ డెస్క్: టీమిండియా యువ క్రికెటర్లు వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్ వ్యవహార శైలిపై మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ తీవ్రంగా స్పందించాడు. మైదానంలో ప్రత్యర్థి ఆటగాళ్లతో అనుచితంగా ప్రవర్తించే యువ ఆటగాళ్లను వదిలిపెట్టకూడదని.. ఐసీసీ, బీసీసీఐ కఠిన చర్యలు తీసుకోవాలని సూచించాడు. ఇలాంటి ప్రవర్తనను పట్టించుకోకుండా వదిలేస్తే.. భవిష్యత్తులోనూ అదే తప్పును పునరావృతం చేసే ప్రమాదం ఉందని హెచ్చరించాడు. భారత్-ఏ తరఫున ఆడేటప్పుడు వైభవ్ సూర్యవంశీ, ఇటీవల యశస్వి జైస్వాల్ శ్రీలంక ఆటగాళ్లతో వాగ్వాదానికి దిగిన సంగతి తెలిసిందే.‘ఇండియా-ఏ తరఫున ఆడేటప్పుడు వైభవ్ సూర్యవంశీ, తాజాగా యశస్వి జైస్వాల్.. వీరి ప్రవర్తన అస్సలు బాలేదు. ఐసీసీ, బీసీసీఐ వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే.. అలాంటి పని మళ్లీ చేయడానికి వారిని ప్రోత్సహించినట్లే అవుతుంది. ఇది ఆటకు మాత్రమే కాదు.. యువ క్రికెటర్ల భవిష్యత్తుకు కూడా మంచిది కాదు’ అని సంజయ్ మంజ్రేకర్ ఐసీసీ, బీసీసీఐలను ఎక్స్ వేదికగా ట్యాగ్ చేస్తూ పోస్ట్ పెట్టాడు.

అసలు గొడవ ఏంటంటే..?

కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్, శ్రీలంక బౌలర్ అసిత ఫెర్నాండో మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఇద్దరి మధ్య ముఖాముఖిగా మాటల యుద్ధం జరిగింది. ఇదే సమయంలో జైస్వాల్ హెల్మెట్ అసితకు తగిలింది. పరిస్థితి చేయిదాటి పోతుండటంతో సహచర ప్లేయర్లు, అంపైర్లు జోక్యం చేసుకుని వారిద్దరినీ దూరంగా తీసుకెళ్లారు. దీనిపై ఐసీసీ క్రమశిక్షణా చర్యలు కూడా తీసుకుంది. ఇద్దరి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోతతో పాటు తలొక డీమెరిట్ పాయింట్ విధించింది. కాగా గత జూన్‌లో శ్రీలంక-ఏతో భారత్-ఏ జట్లు ట్రై సిరీస్ ఆడింది. వైభవ్ సూర్యవంశీ ఔటైన తర్వాత.. డకౌట్‌ను వెళ్తుంటే శ్రీలంక ప్లేయర్ విషేన్ హలమ్ ఏవో వ్యాఖ్యలు చేశాడు. దీంతో ఆగ్రహానికి గురైన వైభవ్.. వెనక్కి వచ్చి ధీటుగా బదులిచ్చాడు. ఒకరిపైకి మరొకరు దూసుకెళ్లినంత పనైంది. అయితే వైభవ్‌తో పాటు లంక ప్లేయర్‌పై ఐసీసీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.